బాబా ఆమ్టే

— పెద్ది సాంబశివరావు



గ్రేహాల్డ్
పో.బా. నెం. 180,
విశాఖపట్నం-1

ఎందరో మహానుభావులు

మానవుని సుఖశాంతులకు అనేక రకాల జబ్బులు ఆటంకం కల్గిస్తుంటాయి - కొన్ని జబ్బుల ప్రభావం స్వల్ప కాలమే వుండగా మరి కొన్నిటి చెడు పరిణామాలు దీర్ఘకాలం కొనసాగుతాయి. గతంలో ప్లేగు, మశూచి వంటి కొన్ని జబ్బులు ఉప్పెనల్లా వ్యాపించి ఒక్కోప్రాంతంలో ఉపద్రవాలను సృష్టించి, అసంఖ్యాక మరణాలకు, అనేక అరిష్టాలకు దారి తీసేవి. అయితే అటువంటి వ్యాధులు రావడానికి, వ్యాప్తి చెందడానికి కారణాలు తెలియడం వల్ల, టీకా మందుల వల్ల వీటి భయం ఇప్పుడు మనకు లేదు. కాని కొన్ని కొత్త జబ్బులు వచ్చి కొత్త సమస్యలను సృష్టిస్తున్నాయి. మరో వంక కుష్టు, క్షయ వంటి దీర్ఘకాలిక వ్యాధులు ఇంకా ప్రపంచంలోని పలు ప్రాంతాలలో సమస్యలుగా ఉన్నాయి. తరతరాల నుండి ఇవి సామాజిక, ఆర్థిక, వైద్య సమస్యలుగా, సవాళ్ళుగా ఎదురు నిలిచాయి.

అయితే రోగాలు, రొష్టుల నుంచి మానవులకు విముక్తి కల్గించడంలో, అస్వస్తులకు ఊరట కలిగించడంలో, చికిత్సా సౌకర్యాలు కల్పించడంలో, పునరావాసపు ఆసరా చూపడంలో శాస్త్రవేత్తల, సామాజిక కార్యకర్తల, త్యాగమూర్తుల పాత్ర విశిష్టమైనది. వారు అందించిన విజ్ఞానం, నడచిన బాటలు, చేసిన సేవలు, తరువాత తరాలవారికి చరిత్రలో ఆదర్శాలుగా నిలిచాయి.

భారతేదేశపు వైద్య సమస్యల్లో ఒకటైన కుష్టువ్యాధిని నిరోధించడానికి, నిర్మూలించడానికి కృషి చేసిన శాస్త్రవేత్తలు సంఘసేవకులు, త్యాగశీలురు ఎందరో వున్నారు. వ్యాధిపట్ల గల అపోహలను తొలగించి, అవగాహనను పెంచడంలో వీరి నిర్మాణాత్మక కార్యక్రమాలే దిక్సూచులుగా నిలిచాయి. తమదైన విశిష్ట విధానంలో కుష్టునిర్మూలనా పధంలో, పధకంలో మానవసేవ చేస్తున్న మహనీయులలో అగ్రగణ్యులు మదర్ థెరిసా, బాబా ఆమ్టే వంటి వారు.

బాబా ఆమ్టే గారి జీవిత విశేషాలు, ఆయన విశిష్ట కృషి వివరాలు తెలిపే ప్రయత్నమే ఈ రచన.

ఆమ్టే బాల్యం

''బాబా ఆమ్టే'' అసలు పేరు మురళీధర్. ఈయన 1914 సం.ము డిసెంబరు 26న మహారాష్ట్రలోని వార్ధా జిల్లాలోని హింగన్ ఘాట్ అనే పెద్ద ఊళ్ళో జన్మించాడు. ఆయన తండ్రి హర్బాజీ దేవిదాస్ ఆమ్టే. ఈయన ఆ ప్రాంతపు జమీందారు. అంతేకాక పెద్ద ప్రభుత్వఉద్యోగం కూడా చేసేవాడు. అందువల్ల మురళీధర్ అష్టఐశ్వర్యాల మధ్య అల్లారు ముద్దుగా పెరిగాడు.

తిరుగులేని పలుకుబడిగల తండ్రి, అడుగులకు మడుగులొత్తే దాసదాసీజనం ఉండటంవల్ల కష్టం అంటే ఏమిటో తెలియకుండా పెరిగాడు మురళీధర్.

చదువుసంధ్యల్లోనూ, ఆటపాటల్లోనూ సమానంగా ప్రతిభగల ఆ బాలునికి గర్వము ఏ మాత్రమూ లేదు. పేదల పట్ల కరుణ, వారి బాధల ఎడ సానుభూతి చూపేవాడు. సేవకులను గూడా ఏనాడూ తక్కువగా చూడలేదు. వారి ఇండ్లలో భోజనం చేయడానికైనా వెనుకాడేవాడుకాదు. సనాతన బ్రాహ్మణుడైన తండ్రి వ్యతిరేకించినా సరే వినకుండా హరిజనులను తమ ఎస్టేటు బావులలో నీళ్ళు తోడుకోమన్నాడు. మనుషులకూ, మనుషులకూ మధ్య అంతరాలను పాటించటం మురళీధర్ కు మనస్కరంచలేదు. అటువంటి పనులు, ఆలోచనలు వాళ్ళ నాన్నకు నచ్చవు. అప్రతిష్ఠ కలిగించే పనులు చేయవద్దని కుమారుని మందలించేవాడు.

పద్నాలుగు ఏళ్ళ వయస్సులో ఇల్లు వదలివెళ్లి అటవికులైన గోండు తెగవారితో కలసి నివసించి విలువిద్యలో ప్రావీణ్యం సంపాదించాడు.

ఉన్నత విద్య

చదువు కొనసాగుతుంది. డాక్టరు కోర్సు చదవడం తన అభిమతం. కాని తండ్రి లాయరు కోర్సు చదివితే మంచిదన్నాడు. కన్నతండ్రి కోరికను కాదనలేక న్యాయశాస్త్రం చదవడానికి అంగీకరించి నాగపూర్ కళాశాలలో చేరాడు. అక్కడ ఆ యువకుని జీవితమే విలాసాలమయం. అప్పట్లో అతి ఖరీదైన రెండు కార్బొరేటర్లు గల సింగర్ స్పోర్ట్సు కారు మీద కాలేజీకి వెళ్లేవాడు. తన రాజసానికి

ప్రతీకలుగా ఆ కారుసీట్లకు పులి చర్మంతో కుట్టిన కవర్లు వుండేవి. గవర్నర్లకు సూటులు కుట్టే బొంబాయిలోని రాస్ టైలర్స్ కుట్టిన దుస్తులనే ధరించేవాడు.

మురళీధర్ దృఢకాయుడేకాక దృఢ మనస్కుడు కూడా కుస్తీ, ఈత, గుర్రపు స్వారీ ఆయనకున్న సరదాలు. లలిత కళలంటే అభిరుచి వుంది. సంగీతం, కవిత్వం పట్ల ఆసక్తి వుంది. రవీంద్రుని సంగీతం వినడానికై ఒకసారి ప్రత్యేకంగా కలకత్తా కూడా వెళ్లాడు. ప్రకృతిని పరిశీలించడమంటే ఆయనకు ప్రాణం. పక్షులు, జంతువుల పట్ల మక్కువ ఎక్కువ కొన్నాళ్ళపాటు ఒక చిరుతపులిని కూడా పెంచాడు. ధైర్యసాహసాలకు ఆయనలో కొదవలేదు. ఒకసారి పులి వచ్చి మీద దూకితే ఎదిరించి పోరాడిన సాహసి ఆయన.

1934లో బి.ఏ. పూర్తి చేశాడు. మరో రెండేళ్ళలో బి.యల్. పూర్తి చేసి ప్లీడరు పట్టా పుచ్చుకొని నాగపూర్ విశ్వవిద్యాలయం నుంచి బయటకు వచ్చాడు.

సినిమాలు చూడటం, వాటిని గూర్చి సమీక్షలు రాయడం ఆయనకున్న మరో సరదా. ఒకసారి ప్రఖ్యాత హాలీవుడ్ నటీమణి నార్మన్ షీరర్ నటించిన ఒక పాత్రను ప్రశంసిస్తూ ఆమెకొక లేఖ రాశాడు. ఆమె జవాబు వ్రాసింది. ఈ పరిచయంతో క్రమంగా వీరిరువురూ కలం స్నేహితులుగా మారారు.

1935లో ప్రస్తుత పాకిస్తాన్ లోని క్వెట్టాలో భయంకరమైన తుఫాను వచ్చి అక్కడి ప్రజాజీవనం అస్తవ్యస్త మయింది. అపుడు మురళీధర్ అక్కడకు వెళ్ళి కొన్నాళ్ళు వుండి పునర్నిర్మాణ కార్యక్రమాలలో పాల్గొన్నాడు.

న్యాయవాద వృత్తి

ఆయన జాలిగుండె గలవాడని చెప్పుకున్నాం గదా! ఈ బలహీనత తెలిసిన వాళ్ళ నాన్న మురళీధర్ ను కేవలం సివిల్ కేసులను మాత్రమే తీసికొని వాదించమన్నాడు. ఆ సూచన మేరకు మధ్యప్రదేశ్ లోని దుర్గ్ లో సివిల్ లాయరుగా ప్రాక్టీస్ ప్రారంభించి నాలుగేళ్ళు కొనసాగించాడు.

తండ్రి పెద్దవాడు కావడంతో ఎస్టేటును కూడా చూసుకోవడానికి వీలుగా వుంటుందని 1940లో తన న్యాయవాద వృత్తిని మహారాష్ట్రలోని వరోరా పట్టణానికి మార్చాడు.

ఒక వంక ప్రాక్టీసు చూసుకుంటూనే కార్మికుల, శ్రామికుల శ్రేయస్సు పట్ల శ్రద్ధ చూపాడు. నేత పని వాళ్లను, వీధులు ఊడ్చే వాళ్ళను, పాకీ పనివాళ్లను సంఘాలుగా ఏర్పరచి వాళ్ళ హక్కుల పరిరక్షణ కోసం పోరాడాడు. తన న్యాయసలహాలను వారికి ఉచితంగా అందిస్తూ వారికి మార్గదర్శకునిగా నిలిచాడు.

స్వాతంత్ర్య సమరయోధుడు

అప్పుడు దేశంలో ''క్విట్ ఇండియా'' ఉద్యమం జోరుగా సాగుతుంది. మహాత్మాగాంధీ, వినోబా భావేల బోధనల ప్రభావంతో ఉద్యమంలో ప్రవేశించాడు మురళీధర్ అమ్టే. స్వాతంత్ర్య సమరయోధులలో తానొకడైనాడు. 1942లో జైలు శిక్షను అనుభవించాడు. ఇండియన్ రివల్యూషనరీ పార్టీ సభ్యులతో సంబంధాలు పెట్టుకొని ప్రభుత్వానికి చిక్కకుండా దొంగతనంగా వాళ్లకు ఆయుధాలను చేరవేశాడు.

అన్యాయాన్ని చూస్తూ సహించి వుండటాన్ని ఆమ్టే అంగీకరించడు. దానిని ప్రతిఘటించడానికై ఎంతటి ప్రత్యర్థులనైనా ఎదుర్కొంటాడు ఆయన. బ్రిటీషు సైనికులు కొందరు ఒక గ్రామంలోని యువతిని మానభంగం చేయబోవడం చూశాడు ఆమ్టే. తానొక్కడే వాళ్ళను ఎదిరించి ఆమెను కాపాడాడు. ఆ విషయం తెలిసిన గాంధీజీ ఆమ్టేను అభినందిస్తూ ''అభయ సాధక్'' అని ప్రశంసించారు. ఆనాటి పోరాటపు గుర్తులు ఇప్పటికీ ఆమ్టే శరీరంమీద నిలచి వున్నాయి.

వివాహం

1946లో ఒక మిత్రుని పెళ్ళికి అమ్టే నాగపూర్ వెళ్లాడు. ఆ పెళ్ళి వారి ఇల్లు వేద పండితులకు నిలయం. ఏడు తరాల నుంచి సంస్కృత విద్యాంసులు

విలసిల్లిన కుటుంబం అది. అక్కడ ఆయన చూచిన దృశ్యం తన జీవితంలో ముఖ్యమైనది. ఆ పెళ్ళివారి ఇంట్లో ఒక ముసలి పనిమనిషి బట్టలను ఉతికి, పిండి, ఆరవేస్తుంది. అసలే పెళ్ళి ఇలు. బండెడు బట్టలను ఆరవేయలేక అలసిపోతూ మధ్యమధ్యలో ఊపిరి పీల్చుకుంటుంది ఆ ముదుసలి. పెళ్ళి కూతురు చెల్లెలు ''ఇందూ'' ఇది చూసింది. వెంటనే ఆ ముసలమ్మకు తోడుగా తానుకూడా పనిచేసింది. అందుకా వృద్ధురాలు సంతోషించింది, ఆశీర్వదిస్తూ తల నిమిరింది.

ఇదంతా మురళీధర్ దూరం నుంచి శ్రద్ధగా గమనించాడు. తనజీవిత భాగస్వామిగా, సహధర్మచారిణిగా కోరుకుంటున్న అమ్మాయి లభించిందనుకున్నాడు. ''ఇందూ''ను పెళ్లిచేసుకోవాలనుకున్నాడు. ఆయన ప్రతిపాదనను పెద్దలు అంగీకరించారు.

కొన్నాళ్ళ తరువాత మరల ఈ ఇంటికి వెళ్లాడు. ఆయన అక్కడ వున్న రాత్రి ఆ ఇంటికి బందిపోటు దొంగలు వచ్చారు. అమ్టే మేల్కొన్నిందు. పారిపోవాలని దొంగ విశ్వప్రయత్నం చేసినా ఆమ్టే వదలలేదు. అపుడా దొంగ ఆమ్టేను కత్తితో పొడిచాడు. అయినా వదలలేదు. వాడు పొడుస్తూనే వున్నాడు. అలా 16 కత్తిదెబ్బలు తగిలాయి ఆమ్టేకు.

తరువాత కొద్దిరోజులకే 1946లో పెళ్ళి చేసుకున్నాడు. గాయాలకు వున్న కట్లతోనే పెళ్ళిపీటల మీద కూర్చున్నాడు.

అత్తగారింట అడుగుపెట్టటంతో ''ఇందూ'' పేరు ''సాధనాతాయ్'' గా మారింది. వరోరాలో కాపురం పెట్టారు. సంసార జీవితం ఆనందంలో సుఖంగా సాగిపోతున్నది. కానీ...

కర్తవ్యం ఏమటి?

ఒకవైపు దేశంలో స్వాతంత్ర్యపోరాటం ముమ్మరంగా కొనసాగుతుంది. మరోవైపు సమాజంలోని దుర్భర దారిద్ర్యం అడుగడుగునా ఆయనను ప్రశ్నిస్తుంది. తన వైపు చూసుకుంటే కనిపిస్తుంది ఆడంబరాలమయం,విలాసాలనిలయమైన జీవితం. తాను చేయవలసిందేమిటి? తన కర్తవ్యము ఏమిటి? ఈ సమాజాన్ని

కొంచెమైనా బాగుచేయడానికి తాను ఆచరించవలసిన మార్గము ఏది? అని పలువిధాలుగా అంతరంగంలో మధనపడ్డాడు. ఆలోచనల సుడులు, ఆవేశపు వడులు, ఆయన్ను ఉక్కిరి బిక్కిరి చేసి ప్రశాంతతను కలగనివ్వలేదు.

1947లో ''శ్రమ ఆశ్రమం'' అనే గ్రామీణ సంఘాన్ని ప్రధానంగా దీనజనులతో ప్రారంభించాడు. ఒక స్నేహితుడు ఇచ్చిన ఏడు ఎకరాల పొలంలో వరోరా ప్రాంతంలో మొదలైన ఈ సంఘం ఆర్థిక ఇబ్బందుల వలన, విడవకుండా వెంటాడిన మలేరియా జ్వరం వల్ల కొనసాగలేకపోయింది.

ఇలా వుండగా 1948 లో వరోరా మునిసిపాలిటీకి ఎన్నికలు జరిగాయి. ఆమ్టే ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. ఆ తరువాత మునిసిపల్ పాకీ పనివారిని ప్రోత్సహించి సంఘంగా ఏర్పరచాడు. అప్పట్లో సెప్టిక్ మరుగుదొడ్లు వ్యాప్తిలోకి రాలేదు. పాకీ పనివారి కష్టాలను స్వయంగా, తెలుసుకోవడానికై వాళ్ళుచేసే పనిని తానుకూడా చేశాడు. రోజుకు నలభై మరుగుదొడ్లను శుభ్రం చేశాడు. ఆ మలాన్ని డబ్బాల్లో ఎత్తుకుని తన భుజాల మీద మోశాడు. వీధులను ఊడ్చినచెత్తను తట్టలతో చేరవేశాడు. ఇలా ఒక్క రోజో, రెండు రోజులో కాదు, పూర్తిగా ఏడాదిపాటు చేశాడు.

అప్పటికే దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. నిర్మాణాత్మక కార్యక్రమం ఏదైనా చేపట్టాలని తీవ్రంగా ఆలోచిస్తున్నాడు ఆమ్టే. ఆయన ఆశయం ఇంకా నిర్ణయం కాలేదు. ఆలోచనలు ఒక కొలిక్కి రావటం లేదు. తన మాతృదేశానికి చేతనయినంత మేలు చేయాలి. ఎలాగా? అని ఆలోచిస్తూ వీధులు ఊడ్చే పనిని కొనసాగిస్తుండగా ఒక రోజు...

వానచినుకులు తుంపరగా పడుతున్నాయి. ఒక చెత్తకుప్ప దగ్గర అంతకంటే హీనంగా, మురికిగా ఏదో ప్రాణి కదలాడుతున్నట్లుంది. ఆమ్టే దాని దగ్గరకు వెళ్ళి చూశాడు. అదొక భయానక దృశ్యం. అవయవాలు సరిగా లేని కుష్టురోగి ఒకడు అవసానదశలో మూలుగుతున్నాడు. అది చూసి ఆమ్టే అదిరిపోయి అక్కడినుండి పారిపోయాడు.

అయినా ఆ దృశ్యం ఆయన మనస్సును విడవలేదు. తాను ఏ పనిచేస్తున్నా ఆ దృశ్యం నేపథ్యంలో వుంటుంది. కీకారణ్యంలో పెద్ద పులిని చూసినా జంకని తాను పుండ్లున్న ఒక రోగిని చూసి భయపడటమేమిటి? పరుగెత్తి పారిపోవడమేమిటి? అని మధనపడ్డాడు, ఆశ్చర్యపడ్డాడు.

తాను చేసే న్యాయవాద వృత్తిలోనూ ఆయనకు తృప్తి లేదు. రోజంతా ఎండలో, వానలో కష్టించి పనిచేసేవాడికి ఒక్కరూపాయి కూడా కూలిగా దొరకటం లేదు. 15 నిమిషాలు మాట్లాడి, కేసును వాదించి యాభైరూపాయల ఫీజు తీసుకోవటం ఎంతవరకు న్యాయం?. ఇది దోపిడి కాదా? నిరుపేదల దగ్గర కూడా ఫీజు తీసుకుంటూ కొనసాగించేది న్యాయవాద వృత్తేనా? ఇది సిగ్గుపడవలసిన విషయం కాదా? అనే ప్రశ్నలు ఆయనను కలవర పరిచాయి. తమ ఎస్టేటులో పంటలు పండిస్తూ బక్కచిక్కిన బడుగు రైతులు ఎదుర్కొంటున్న దయనీయ జీవన పరిస్థితులు ఆయనను కలతపరిచాయి. మానవత్వం పూర్తిగా మేలుకొంది. సమాజంలోని అట్టడుగు వర్గాల వారికే సేవ చేయాలని తీర్మానించుకున్నాడు.

1949లో న్యాయవాద వృత్తికి వీడ్కోలుచెప్పాడు ప్లీడరు పట్టాను చించివేశాడు. ఆస్తిలో తన వాటాను వదులుకున్నాడు. వరోరా దగ్గరి గోరోజ్ లోని 450 ఎకరాల పొలన్ని కౌలుదార్లకే ఇచ్చివేశాడు.

జీవితాశయ ఎంపిక

సమాజంలో తన సేవలు ఎన్నో రంగాలలో అవసరమే అయితే అన్నిట్లోకి ఎక్కువ ప్రాధాన్యత కలదానిని ఎంచుకోవలసి వచ్చింది. అది సాంఘిక సమస్య మాత్రమే కాదు. కొంత మేరకు ఆర్థిక సమస్య. అంతేకాదు, అది వైద్య సమస్య కూడా. ఇన్ని విధాల జటిలమైన ఈ సమస్య కుష్టువ్యాధి.

ఒకసారి కుష్టువ్యాధి చరిత్రను పరిశీలిస్తే ఈ రోగులు మొదటి నుంచి నిరాదరణకే కాక నిర్లక్ష్యానికి కూడా గురయినట్లు తెలుస్తుంది. ఈ వ్యాధి ప్రపంచంలో చాలా దేశాలలో వున్నట్లు చారిత్రక ఆధారాలున్నాయి. ఇది

ఆయుర్వేద వైద్యగ్రంథాలలోనూ, బైబిలు లోను, ఇంకా పలుచోట్ల ఉదహరించబడింది. ఈ రోగులను వెలివేయడం, ఖైదీల కన్నా హీనంగా చూడటం జరిగింది. కుష్టురోగి ఊళ్ళోకి వస్తే అతనిని రాళ్ళతో కొట్టి తరిమేవాళ్ళు.

సైనికుల ద్వారా, వలసవచ్చే వాళ్ళవల్ల ఈ జబ్బు పలుప్రాంతాలకు విస్తరించిందనుకోవచ్చు. 15వ శతాబ్దం వరకు యూరప్‌ను ఒక కుదుపు కుదిపేసింది ఈ జబ్బు. రోగులను మొదటిసారి మానవతా దృష్టితో, కరుణాభావంతో చూసినవి లాజరస్ లే. ఇవి క్రైస్తవ మతబోధకులచే నిర్వహించబడిన సత్రాలు. రోగులను భగవంతుని స్వరూపాలుగా గుర్తించి వాళ్ళ పుండ్లకు కట్టు కట్టి, వాళ్ళ ఆకలిని తీర్చి ఆదరించింది వీటిలోనే.

ఏసుక్రీస్తు కుష్ఠురోగులను పరిశుద్ధులుగా మార్చినట్లు, ఒకని నొసటన ముద్దు పెట్టుకున్నట్లు తెలుస్తుంది. శతాబ్దాలు గడిచాయి. అయినా ఈ రోగం వల్ల అవగాహన పెరగలేదు. రోగుల పట్ల జాలి కలగలేదు సామాన్య మానవులకు.

కుష్ఠురోగులను వేరుచేసి వారిని దూరంగా కాలనీలలో వుంచేవారు. ఇటువంటి కాలనీ హవాయి దీవులలో ఒకటి వుంది. పసిఫిక్ సముద్రంలోని ఈ దీవులకు 1864 సంవత్సరములో మత బోధకుడుగా ఫాదర్ డామియన్ అనే బెల్జియం దేశపు కాథొలిక్ యువకుడు వెళ్లాడు. ఆయన స్వయంగా రోగులను వుంచిన మొలకాయ్ అనే దీవికి వెళ్లి రోగుల మధ్య కలసి నివశించాడు. అక్కడి రోగుల దయనీయస్థితిని అభివృద్ధి పరిచాడు. ప్రపంచ ప్రజల దృష్టిని ఆకర్షించాడు. తాను కూడా ఈ వ్యాధికి గురయి 1869లో మరణించాడు. ఆయన మరణం ప్రపంచపు కళ్ళు తెరిపించింది. తన జీవితాన్ని సమిధగా వెలిగించి మొలకాయ్ దీవులలో డామియన్ చేసిన సేవలకు దాతల హృదయాలు ద్రవించాయి. దేశదేశాలలోని లక్షలాది కుష్టురోగుల దయనీయ స్థితిగతులను మెరుగు పరచడానికి ధన, వస్తు రూపాలలో సహాయాలు అందాయి. కొత్త సంస్థలు వెలిశాయి. మిషనరీ శాఖలు ఆయన అడుగుజాడలలో ఆసుపత్రులను

ప్రారంభించాయి. డామియన్ మరణం కుష్టు రోగుల జీవితాలను ఆనందమయం చేసే ఉద్యమానికి నాంది అయింది.

బ్రిటీషు సామ్రాజ్యపాలకులు మొలకాయ్ దీవిలో డామియన్ స్మారకచిహ్నం ఏర్పరచారు. డామియన్ ఇన్‌స్టిట్యూట్ స్థాపించి ప్రధానంగా కుష్టువ్యాధి గూర్చి అధ్యయనం ప్రారంభించారు. తమ సామ్రాజ్యంలోని ఇండియాలో, తదితరచోట్ల వున్న కుష్టురోగుల స్థితిగతులను క్షుణ్ణంగా పరిశీలించడానికి ఒక కమీషనును వేశారు. క్రైస్తవ మిషనరీలు భారతదేశంలో అక్కడక్కడ కొన్ని ఆసుపత్రులను ప్రారంభించి ఈ రోగులకు వైద్యం చేయసాగారు.

కాని ఈ వ్యాధికి సమర్థవంతమైన మందులు లేవు. చాల్ ముగ్రా (విషముష్టి) నూనెను ఇంజక్షనుల ద్వారా రోగి చర్మంపై గల మచ్చలకు ఇచ్చేవారు. ఇది వ్యాధిని కొద్దిగా అదుపు చేసేది. ప్రారంభదశలో వుంటే వ్యాధిని తగ్గించేది.

ఇన్ని విధాలుగా క్లిష్ట సమస్యయైన కుష్ఠురోగుల సేవను అమ్టే ఎంచుకున్నాడు. ఆ రోగుల బాగుకు నడుం బిగించాడు

ఆనందవన్ ఆరంభం

1949లో ప్రభుత్వం నుంచి ఇరవై హెక్టార్ల చిట్టడవిని కౌలుకుతీసుకున్నాడు. అర్గురు అవిటి కుష్టురోగులు, ఒక కుంటి ఆవు, పద్నాలుగు రూపాయల డబ్బుతో ప్రారంభమయింది అనందవన్.

మురళీధర్, సాధనా తాయ్‌లకు ఒక బాబు కలిగాడు. ఆ పసిపిల్లవాడితో రాళ్ళ గుట్టల మధ్య పూరిపాకలో కాపురమున్నారు. ఎదురుగా అటువంటి పాకలలోనే రోగులు నివాసమున్నారు. సాధన అందరికీ కలిపి వంట చేసేది. రోగులపుండ్లకు కట్లుకట్టేది. బావులు తవ్వడం వంటి పనుల్లో కూడా చేతనయిన సహాయం చేసేది. ఎటువంటి సమస్యలనైనా, అడ్డంకులనైనా ఎదుర్కోవడంలో భర్తకు తోడుగా నిలచిన ఆదర్శగృహిణి ఆమె.

కుష్టురోగులనే కాదు, ఆ రోగులకు సేవ చేసేవాళ్లను గూడా వెలివేసే రోజులవి. సన్నిహిత మిత్రులు కూడా ఆమ్టే వాళ్ళ పాక దగ్గరకు వచ్చి వాళ్ళతో కలసి టీ తాగటానికి ఇష్టపడే వాళ్ళుకారు. వాళ్ళ పిల్లవాడికి ఆడుకునే తోడుకూడా లేదు.

మంచినీళ్ళ కోసం బావులు తవ్వవలసి వచ్చింది. కొన్ని 70 నుంచి 80 అడుగులదాకా లోతున తవ్వారు. ''అయితే ఆ బావులు తవ్వడానికి మేము చెమర్చిన చెమటకంటే ఆ బావుల్లో వచ్చిన నీళ్ళు తక్కువ'' అంటాడు ఆమ్టే.

కుష్ఠరోగులకు వ్యాధి ఉపశమనం కొరకు ఏవో మందులు ఇచ్చినంత మాత్రాన సమస్య పరిష్కారం కాదు. వారిలో ఆశలు చిగురింపజేయాలి, ఆత్మ విశ్వాసం నెలకొల్పాలి. వారి జీవితాలకు ఆదర్శం, లక్ష్యం చూపాలి. ఈ దిశగా పని ప్రారంభించాడు.

సమాజంలో నుంచి వెలివేయబడి తలదాచుకోవడానికి మరే చోటులేని అభాగ్యులైన కుష్టురోగులు ఆమ్టే పంచకు చేరుకోసాగారు. వీళ్ళబృందం పెరిగేకొలది భవనాలు కొత్తగా నిర్మించవలసి వచ్చింది.

మహాత్మాగాంధీ నెలకొల్పి, నడుపుతున్న సేవాగ్రాం ఆశ్రమం అక్కడకు వంది కిలోమీటర్ల దూరంలో వుంది. అంతర్జాతీయ పౌర సేవాదళకార్యకర్తలు తమ నిర్మాణాత్మక కార్యక్రమాలను అక్కడ కొనసాగిస్తున్నారు. వాళ్ళు ఆమ్టే కొనసాగిస్తున్న అపూర్వ ప్రయోగం తెలుసుకొన్నారు, ఆశ్చర్యపడ్డారు, ఆనందించారు. ఆ విశిష్ఠకార్యంలో తాముకూడా పాలు పంచుకోవాలని బయలుదేరారు. 23 భాషలు మాట్లాడే 50 మంది యువకులు శక్తి కలిగిన రోగులతో కలసి మూడు నెలలపాటు అక్కడే వుండి ఆమ్టే నేతృత్వంలో మూడు భవనాలను నిర్మించి వెళ్లారు. ఇటుకలు, సున్నంతో భవనాలను నిర్మించడం రోగులు కూడా నేర్చుకున్నారు. తరువాత కట్టిన భవనాలన్నిటినీ రోగులే తాపీ మేస్త్రీలుగా వుండి నిర్మించారు.

ఆనందవన్ అభివృద్ధి ఒక రోజులో జరిగిన అద్భుతం కాదు. అది క్రమంగా జరిగిన విజయగాధ, జరుగుతున్న చరిత్రదృఢ సంకల్పము, కృషి విజయానికి సంకేతం. నిరాశ, నిస్పృహల ఓటమికి మాత్రమే తార్కాణం. భౌతికంగా కనిపించే మార్పులు, అభివృద్ధి మాత్రమే కాదు, మానసికంగా రోగులలో నైతికబలం కూడా పెరిగింది, ఆత్మ విశ్వాసం దృఢపడింది.

1951 లో మహారోగి సేవాసమితిని స్థాపించారు. తరువాత దానిని పబ్లిక్ ట్రస్టుగా మార్చారు. ఆచార్య వినోబా భావే దాన్ని సూత్రప్రాయంగా ప్రారంభిస్తూ ''కావ్యాలలో ఉత్కృష్ఠమైనది రామాయణం. సేవారంగంలో విశిష్టమైన కావ్యం వంటిది ఈ సంస్థ'' అన్నారు.

సేవ అంటే ప్రజల కొరకు పనిచేయడమే కాదు, ప్రజలతో కలసి పని చేయడం అని ఆమ్టే నమ్ముతాడు. అయితే తన ముందున్నది మామూలు పని కాదు. కొండతో పొటేలు ఢీకొన్నట్లుంది. ఆ అనంతమైన పనిని చూస్తుంటే ఒకోసారి గుండె చెదిరి భయం వేసేది. తానొక్కడూ ఆ పని నంతటినీ చేయగలనా అని అనుమానపడేవాడు. తన కలం స్నేహితురాలు, హాలీవుడ్ నటి నార్మస్ షేరర్ కు ఉత్తరం వ్రాశాడు.

''నేను ఈ భయం నుంచి విముక్తుడను కావాలని నిశ్చయించుకున్నాను. కడగండ్లు పడుతున్న నా సోదర సోదరీమణులతో బాధలను, స్నేహాన్ని పంచుకోవాలి. స్నేహసౌధాలను వారితో కలసి నిర్మించుకోవాలి.

'భయం వున్న చోట ప్రేమ విలువ లేదు. ప్రేమ లేని చోట భగవంతుడే వుండలేడు. కనుక నాలోని భయాన్ని తొలగించుకోవాలి' అని వ్రాశాడు ఆమ్టే. ఆమె వెంటనే సముచిత రీతిలో ప్రోత్సహిస్తూ జవాబు వ్రాసింది. ఆయనను అభినందిస్తూ కొంత ధన సహాయం చేసింది. అనందవన్‌కు విదేశీయుల నుంచి అందిన మొదటి సహాయం అదే.

ప్రత్యేక శిక్షణ

కుష్ఠురోగులకు సేవ చేయాలన్నా, వైద్యం చేయాలన్నా ఆ వ్యాధిని గూర్చి బాగా తెలుసుకోవడం అవసరం. ఆమ్టేకు అప్పటికే 35 సం.రాలు. ఆయన మెడికల్ కాలేజీకి వెళ్ళి వైద్యశాస్త్రం అధ్యయనం చేసే వీలులేదు. వార్ధా దగ్గరి దత్తాపూర్ లోని కుష్ఠురోగుల కాలనీని అంతకు మునుపే చూసి వచ్చాడు. వినోబాభావే ప్రేరణతో మనోహర్ దీవాన్‌జీ అనే సర్వోదయ కార్తకర్త దాన్ని నడుపుతున్నాడు. అక్కడ ఆ కాలనీలోని రోగుల బాగోగులు తెలుసుకున్నాడు. కాని కుష్ఠువ్యాధి గురించి మరింత శాస్త్రీయ సమాచారాన్ని తెలుసుకోవాలి. అందుకే ఆయన కలకత్తాలోని (స్కూల్ ఆఫ్ ట్రాఫికల్ డిసీజెస్) ఉష్ణ ప్రాంతపు వ్యాధుల అధ్యయన కేంద్రానికి వెళ్లాడు. అక్కడ ఈ వ్యాధిని గూర్చి ఆరు వారాలు ప్రత్యేక శిక్షణ పొందాడు.

ఆ సమయంలో ఒక రోజు క్లాసులో పాఠాలు చెపుతూ ఇలా అన్నాడు లెక్చరరు.

''చాలా వ్యాధులు వైరస్, బ్యాక్టీరియా వంటి సూక్ష్మజీవులవల్ల మానవులకు వస్తాయి. క్షయ, కుష్ఠు వంటి జబ్బులు బ్యాక్టీరియాల వల్ల వస్తాయి. కుష్ఠువ్యాధిని కలిగించే ''మైకో బ్యాక్టీరియామ్ లె ప్రే'' ను 1873 సం. ములో నార్వే దేశపు డాక్టరు హేన్సన్ కనుగొన్నాడు. చాలా రకాల బ్యాక్టీరియంలను ప్రయోగశాలల్లో కృత్రిమ పద్ధతుల ద్వారా పెంచగల్గుతున్నాం. అందువల్ల ఆయా బ్యాక్టిరియాలను చంపగల మందులను కనుక్కునే వీలువుతుంది. కాని కుష్ఠు సూక్ష్మజీవులను ప్రయోగశాలలో పెంచలేకపోతున్నాం. ఇలా కల్చరు చేయలేకపోవడానికి ఒక పెద్ద అటంకం ఏమంటే కుష్ఠువ్యాధి మనిషికి తప్ప మరి ఏ ఇతర జంతువుకూ సోకదు. కుష్ఠు క్రిములను జంతువుల శరీరం లోకి పంపినా వాటికి జబ్బు రాదు. మనుషులకు మాత్రమే ఈ వ్యాధి సోకుతుంది. కనుక ఈ వ్యాధిని గూర్చి పరిశోధన చేయాలంటే వలంటీర్లుగా కొందరు మనుషులే కావాలి –కాని చూస్తూ

చూస్తూ ఏ మనిషి కూడా ఈ భయంకర వ్యాధికి ప్రయోగశాలగా తన శరీరాన్ని అర్పించలేదు కదా?''.

లెక్చరరు చెప్పిన మాటలు మురళీధర్ మనసులో ప్రతిధ్వనించాయి.

- ఎలుకల పాదాలలో, తొమ్మిదిచారల ఆర్మీడిలా అనే జంతువుల్లో, ముంగాబే రకపు కోతుల్లో కుష్ఠు క్రిములు పెరుగుతాయని ప్రస్తుత పరిశోధనల్లో తేలింది.

రెండు రోజుల పిమ్మట క్లాసులో జరిగిన సంఘటన అందరినీ అశ్చర్యపరచింది. తమ కళ్ళను, చెవులనే తాము నమ్మలేకపోయారు. మురళీధర్ లేచి నుంచున్నాడు. 'మాష్టారు గారూ' నేను నా శరీరాన్ని కుష్ఠువ్యాధి ప్రయోగాలకు పరిశోధనకు ఇవ్వడానికి సిద్ధంగా వున్నాను. ఫాదర్ డామియన్ వంటి మహానీయుల తేజోమయ, త్యాగపూరిత జీవితమే నాకు ఆదర్శం. ఒక వేళ నాకు ఏమైనా జరిగినా నన్ను చూసుకోవడానికి నా భార్య 'సాధన' వుంది'' అన్నాడు ధైర్యంగా ఒక్కబిగిన.

తరువాత కుష్ఠురోగుల నుంచి సేకరించిన క్రిములతో కూడిన ద్రవాన్ని తన శరీరంలోకి ఇంజక్షను చేయించుకున్నాడు. కాని ఆయన ధృఢ శరీరంలో ఆ క్రిములు పెరగలేదు. ప్రయోగం విఫలమయింది. దాదాపు ఆ సమయంలోనే కుష్ఠురోగులకు ఆశాకిరణం ఒకటి కనపడింది. అమెరికాలో 'సల్ఫోను' అనే మందు బిళ్లలు ఈ వ్యాధికి పనిచేస్తాయని తెలుసుకున్నాడు. మురళీధర్ శిక్షణ పూర్తి చేసుకొని తరువాత మందులను గూర్చిన వార్తలతో, చిగురించిన ఆశలతో వరోరాకు తిరిగివచ్చాడు.

ఆమ్టేకు ఆదర్శాలు

మహాత్మాగాంధి పర్చూరే శాస్త్రి అనే కుష్ఠురోగిని తన ఆశ్రమంలోనే వుంచుకొని అతని పుండ్లను కడిగి కట్లుకట్టాడు. సపర్యలు చేశాడు. వినోబాభావే ''సేవ''కు సర్వోదయ సిద్ధాంతము ద్వారా నూతన నిర్వచనం చెప్పాడు. దత్తపూర్లో కుష్టురోగుల కాలనీలో రోగుల పక్కనే భుజం భుజం రాసుకుంటూ వారితో కలసి

వరినాట్లు వేశాడు. ''భగవంతుడు భక్తులును పరీక్షచేయడానికై కుష్ఠురోగులు, బిచ్చగాండ్లు, అవిటివాళ్ళ రూపంలో వస్తాడు'' అన్నాడు స్వామి వివేకానంద అన్నారు. ప్రార్థించే పెదవులకన్నా సేవచేసే చేతులే మిన్న'' అన్నాడు రాబర్ట్ ఇంగర్ సాల్ అన్నారు. ఆమ్టే అటువంటి మహాత్ముల మాటలు, చేతలు మననం చేసుకున్నాడు.

రోగుల పునరావాస కేంద్రానికి తోడుగా వైద్యకేంద్రాన్ని ప్రారంభించాడు. కొద్ది నెలల్లో అక్కడకు వచ్చి మందులు తీసుకునే వారి సంఖ్య వందలకు చేరింది.

సైకిలు మీద, ఎద్దులబండి మీద వెళ్లి వరోరా పట్టణంలో, పరిసరగ్రామాల్లోని వివిధ ప్రాంతాలలో నియమిత వారాల్లో క్లినిక్ లు నడిపి రోగులకు మందులు అందించాడు.

ఆనందవన్ లో రోగులకు పునరావాస సౌకర్యాలు పెంచవలసి వచ్చింది. ''పునరావాసం అంటే ఆత్మ విశ్వాసాన్ని పునః ప్రతిష్ఠ చేయడమే. అందుకు కుష్టురోగి పట్ల మనం గాఢవిశ్వాసం చూపాలి. అతనొక ప్రయోజనకరమైన వ్యక్తి. అతను కూడా దేశసౌభాగ్యానికి తనవంతు కృషి చేయగలడు'' అని నమ్మాలి. ''కృషి నిర్మాణాత్మకమైనది. దానం వినాశకరమైనది'' అని ఆమ్టే ప్రగాఢ విశ్వాసం.

''కుష్ఠువ్యాధి శాపం వల్లనో, పాపం వల్లనో వచ్చేది కాదు. ఒక స్వల్ప దురదృష్టకర, యాదృచ్ఛిక సంఘటన మాత్రమే. ఏ మానవుని జీవితంలోనైనా జరగడానికి వీలున్న సంఘటన. అది నాకు, నీకు.... తెల్లవాడికీ, నల్లవాడికీ... ఎవరికైనా రావచ్చు. కుష్ఠురోగులు ఏ నేరమూ చేయకపోయినా శతాబ్దాల తరబడి హింసలకు గురవుతున్నారు. ఇలాంటి రోగులను ఓదార్చే ప్రయత్నమే పునరావాసం''. ''అవయవాలన్నీ సరిగావుండి కూడా తిండి కోసం ఇతరులమీద ఆధారపడి బతికే వాళ్ళకంటే మా రోగులు ఎంతో నయం'' అంటారు ఆమ్టే.

పెరుగుతున్న అవసరాలు

ఈ ఆశయాలతో ఆయన పనిచేసుకుంటూ ముందుకు సాగుతుంటే అక్కడే వుండటానికి వచ్చే రోగుల సంఖ్య పెరగసాగింది. రోగులతోపాటు అవసరాలు గూడా పెరిగాయి. ఏ దిక్కూ లేక, పలకరించే నాధుడు లేక చివరి ఆశగా తన నీడకు చేరవచ్చిన రోగులను ఖాళీ లేదనో, మరొక నెంపంతోనో వెనక్కు పంపడం ఆమ్టేకు నచ్చదు. 'ఇక్కడ తమ ఇష్టం లేకుండా ఏ ఒక్క రోగినీ ఉంచుకోవడం జరగదు. బలవంతంగా పంపివేయడమూ జరగదు' అంటారాయన.

సాధారణంగా మానవ సమాజంలో మొక్కబోని అచంచల విశ్వాసం కలిగిన వారు అరుదుగా కనిపిస్తారు. కాని ఆనందవన్ లో అందరిలో అది ప్రస్ఫుటంగా కానవస్తుంది. అదే అక్కడి ప్రత్యేకత. పనికిరాని వాళ్ళుగా సమాజం నుంచి వెలివేయబడ్డ వాళ్ళే ఆదర్శంగా పనిచేస్తూ, వాళ్ల అవసరాలు తీర్చుకుంటూ, ఇంకా మిగిలింది సమాజానికి పంచి ఇవ్వాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు. ఆనందవన్ లో ఒకరి నుంచి మరొకరికి అంటుకునేది జబ్బుకాదు, చిరునవ్వు మాత్రమే. 'వృధాగా పోయిన ఏ పదార్థాన్నయినా తిరిగి తీసుకురాలేము' అనే ప్రేరణతో ఆమ్టే బృందం పనులు చేసింది. ఆనకట్టలు కట్టినా, ఆసుపత్రులు నిర్వహించినా అంతా ప్రత్యేకతతో స్వంత ఆలోచనలతో, స్వంత డిజైన్లతో చేశారు. ట్రాక్టరు ఇంజనునైనా, శస్త్రచికిత్సా పరికరాన్నయినా బాగు చేయగల పనివాళ్ళుగా రోగులు తయారయ్యారు.

ఆనందవన్ ఒక ఆదర్శ గ్రామంగా రూపుదిద్దుకోసాగింది. అందరి సుఖం కోసం అందరూ కలసి పనిచేసే సహకార సమాజం అది. పరిశుభ్రత, సౌందర్యమూ, ఉత్సాహాలు ముప్పిరిగొని వుండగా తమ బాధలనే మరచిపోయారు రోగులు. ప్రతి పనీ శాస్త్రీయంగా, కళాత్మకంగా చేయసాగారు.

ధైర్యసాహసాలకు ఎన్నయినా ఉదాహరణలు చెప్పుకోవచ్చు – ప్రాణాలను లెక్కచేయక మరికొందరిని కాపాడిన వాళ్ళు, దేశంకోసం ప్రాణత్యాగం చేసిన వాళ్ళు వగైరాలు, కాని కాళ్ళు చేతులకు వేళ్ళు కూడా లేని అవిటి కుష్ఠురోగులచేత

అద్భుత నిర్మాణాత్మక కృషిని చేయించడమే ఆమ్టే గొప్పదనం. పర్వతాల పునాదులను కదిలించగలిగిన సంకల్పబలం అయనది.

ఆనందవన్ లో ఆశ్రయం కోరి వచ్చే రోగుల సంఖ్య పెరుగుతుంది. సామూహిక వంటశాలలు తయారయ్యాయి. ఒకో వంటశాలకు మూడు నాలుగు వందల మంది రోగులుంటారు. వీరంతా కలసి పనిచేస్తుంటారు. కలసి వుంటారు, కలసి తింటారు, అయితే అంతటితో సరిపోదు. వారి జీవితాలలో ఇంకా ఏదో వెలితి వున్నట్లుగా ఆమ్టే భార్య సాధన గ్రహించింది.

వ్యాధి నుంచి విముక్తులయిన రోగులు వివాహాలు చేసుకోవడ అవసరమనుకున్నది ఆమె. ఆనందవన్ లో ప్రతి ఏటా ఫిబ్రవరిలో మిత్ర సమ్మేళనం జరుపుతారు. ఆ సందర్భంగా కొందరు రోగులు పెళ్లి చేసుకోవడం ప్రారంభించారు. అటువంటి దంపతులు ''షుఖసదన్'' అనే విభాగంలో నివసిస్తుంటారు. రోగుల్లో కొందరు ముసలివాళ్ళు, అశక్తులుంటారు. వారికి జీవిత చరమదశలో ఆత్మీయత అవసరం. అలాటివారిని అత్తగానో మామగానో ఒక్కొక్క కుటుంబం వాళ్ళు ఒకరిని దత్తత తీసుకోవడం ప్రారంభించారు, ఇందువల్ల దంపతులకు పెద్ద అండ దొరకడమే కాకుండా వృద్ధులకు సన్నిహితంగా చూసుకునే వాళ్ళు దొరుకుతారు.

నూతన మార్గం

రోగులంతా ఆమ్టేను ఆప్యాయంగా ''బాబా'' అని పిలవడం మామూలయ్యింది. దానితో ఆయన ''బాబా ఆమ్టే '' అయ్యారు. బాబా కమ్మని కవితలు కూడా వ్రాస్తారు. ఆయన మొదట్లో వ్రాసిన ఒక కవితను చూద్దాం.

''నేనొక ఒంటరి ననుకున్నాను
కాని దారి మలుపు దగ్గర గమనించాను
నా వంటి ఏకాకులు ఇంకా ఎందరో వున్నారు.
మేమంతా సంఘటితమయ్యాం

అందరమూ బాధితులమే.

అయినా

ఉత్సాహంలో, నిశ్చయంలో సంఘటితులం మేము.

మా బాధలే మా అనుసంధాన శక్తులు

మేమొక నూతన ప్రదేశాన్ని నిర్మించాం

ఇక్కడి నుంచే భావి తరపు నాయకులు ఉద్భవిస్తారు

సమాజమొక నూతన మార్గాన్ని దర్శిస్తుంది''

మహాత్మాగాంధి కలలుగన్న రామరాజ్యాన్ని, స్వయంసమృద్ధ గ్రామాలను ఆమ్టే ఆచరణలో చూపగలుగుతున్నాడు. మతం పేరుతో కొనసాగుతున్న మూఢవిశ్వాసాలు అభివృద్ధికి ఆటంకాంలు అంటారు ఆమ్టే. ఆయనకు విగ్రహారాధనలో, మూఢభక్తిలో నమ్మకం లేదు. అయినా ఇతరుల అభిప్రాయాలను కించపరచడు. భార్య పూజ చేసుకుంటానంటే అడవిలో పూలు కోసి తెచ్చి ఇస్తాడు. రోగులు తమ ఇష్టం వచ్చిన మతాన్ని, నమ్మకాన్ని అనుసరించవచ్చు. ఏ వత్తిడీ లేదు. వంటశాలల్లో శాకాహారమే వండుతారు. మాంసాహారం కావాలంటే విడిగా వండుకొని తినవచ్చు. మతం లాగానే రాజకీయ అభిమానాలను, ద్వేషాలను ఆయన పట్టించుకోడు. ''మనిషికీ మనిషికీ మధ్యనే సోదర భావాన్ని నెలకొల్పలేని హిందూమతం వంటి మతాలు మనిషికీ దేవునికీ మధ్య సంబంధాన్ని ఏర్పచలేవు. నేను సమకాలీన క్రైస్తవుడను కావాలనుకుంటున్నాను. అయితే వాకిట్లోని మురుగు కాల్వలో మనిషి మునిగిపోతుంటే పట్టించుకోకుండా సూటు మురికి అవుతుందనో, ఆఫీసులో అవసరమైన పనివుందనో దాటిపోయే క్రైస్తవుడిని కూడా కాకూడదు' అంటారు బాబా ఆమ్టే .

ఆనందవనీయులు నూతిలో కప్పలవలె బయటి ప్రపంచపు విషయాలను పట్టించుకోకుండా వుండరు. 1962 లో చైనా దురాక్రమణ జరిపినపుడు భారతీయులంతా ఒక్క తాటిపై నిలచి ఎవరికి చేతనయిన సహాయము వాళ్ళు చేశారు. ఆనందవన్ రోగులు మేము మాత్రం వెనకబడివున్నామా? అంటూ ఒక

నాటకాన్ని తయారు చేశారు. దాన్ని పక్కఊరిలో ప్రదర్శించి తద్వారా వచ్చిన రెండు వేల రూపాయలను యుద్ధసహాయనిధికి పంపారు.

విద్యాసంస్థల స్థాపన

ఆనందవన్ కు దగ్గరలో వరోరా పట్టణం వున్నట్లు మనకు తెలుసు. అయితే ఆ పట్టణ విద్యార్థులు కళాశాల లేక ఇబ్బందులు పడటం గమనించారు ఆమ్టే. వారికొక కాలేజిని నిర్మించి ఇవ్వాలనుకున్నారు. ఆలోచనను ఆచరణలో పెట్టారు ఆమ్టే అనుచరులు. స్వంతగా మంచి మట్టి తెచ్చి, మర్దించి ఇటుకలు చేశారు, కాల్చారు. చెక్క, పనులు, తాపీ పనులు చేశారు. నగిషీలు దిద్దారు. భవనాలు పూర్తి అయ్యాయి. 1964 సం.ము లోనే అవి దాదాపు రెండున్నర లక్షలు అయ్యాయి. ఆ డబ్బంతా రోగులు తమ వ్యవసాయ క్షేత్రాలలో శ్రమించి మిగిల్చిన లాభమే.

తరువాత సంవత్సరాలలో ఆర్ట్సు, సైన్సు, కామర్సు, అగ్రికల్చర్ కాలేజీలను కూడా నెలకొల్పారు. ఒకనాడు ఈ కాలనీని చూసిపోవడానికే వెనకాడిన ప్రజలు ఈ విద్యాసంస్థల్లో తమ పిల్లలను చేర్చడానికి ఉరకలు వేస్తున్నారు. ఈ ఉత్తమ విద్యాబోధన పద్దతుల పట్ల ఆకర్షితులై పొరుగు రాష్ట్రాల నుంచి కూడా విద్యార్థులు వచ్చి చేరుతున్నారు. కొన్ని కొత్త డిప్లొమా కోర్సులను ప్రారంభించారు. అన్ని విద్యా సంస్థలలో కలసి ప్రస్తుతం 1500 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. అందుకే కళాశాల భవనాల వైపు వేలెత్తి చూపుతూ సగర్వంగా అంటారు బాబా ''అవిగో చూడండి, సజీవ చిహ్నాలు. కుష్ఠురోగులు ఎవరి మీదా ఆదారపడలేదు. పైగా వాళ్ళే సమాజానికి మేలు కూడా చేశారు. సేవలు, సహాయం అందుకునేవాళ్ళే సహాయం చేశారు'' అని.

బాబా భావాలు:

''ఈ కాలంలో పనులన్నీ అతివేగంగా జరిగిపోతున్నాయి. అలా జరగవలసిందే. అయితే అందుకు తగినట్లుగా అందరూ అన్ని పనులనూ కొద్దో,

గొప్పో తెలుసుకోవాలి''. నాకు ఆ పని చేతకాదు, ఈ పనిరాదు అంటూ చేతులు ముడుచుకొని కూర్చోకూడదు – నేనొక మహావ్యక్తిని కావాలనుకోవడం లేదు. చేతిలో ఒక ఆయిల్ క్యాను పట్టుకొని తిరుగుతూ వుంటాను. అవసరమైన యంత్రభాగాలకు ఆయిల్ వేయడానికి, అవి సరిగా పనిచేసేలా చూడటానికి సిద్ధంగా వుంటాను. అదే నా జీవిత ఆదర్శం అంటారు ఆమ్టే. ఆయన చెప్పిన యంత్రం సమాజమేనని గ్రహించవచ్చు.

ఆనందవన్ ను దర్శించి కొన్నాళ్ళు అక్కడే వుండి పరిశీలించిన ఒక క్రైస్తవ మతగురువు ఇలా అన్నాడు. 'ఇక్కడ మానవ విలువలు పొంగి పొర్లుతుంటాయి. ఉన్నదంతా పోగొట్టుకొని, కుంగిపోయి నిరాశ, నిస్పృహలతో కాళ్ళీడ్చుకుంటూ ఏకాకులుగా వచ్చిన రోగులకు శ్రద్ధ, ప్రేమ, అనురాగం అవగాహన, అంకితభావం, ప్రోత్సాహం, స్వేచ్ఛ ఇక్కడ లభిస్తున్నాయి. అంతేకాదు వీటన్నిటినీ మించినది, అరుదైనది సమానత్వం ఇక్కడ విస్తరించివుంది'.

తగినంత ఆచరణలో ఉన్నప్పుడు సామాజిక కార్యక్రమాలు సత్ఫలితాలను ఇస్తాయి. సమాజంలో అకలికి, దారిద్ర్యానికి, అసమానతలకూ వ్యతిరేకంగా సుదీర్ఘ పోరాటం జరపాల్సి వుంది. సంఘసేవలో నిజాయితీ కొరవడడం వల్లనే పేదరికం,అశాంతి, నిరుద్యోగం వంటి జాతీయ సమస్యలు విజృంభిస్తున్నాయి అంటారు ఆమ్టే.

'ఈ నిచ్చెన మెట్ల సమాజ వ్యవస్థలో కుష్ఠువ్యాధి అట్టడుగున వుంది. ఇది వైద్యపరమైన అవిటి తనంగా సాంఘిక దుర్బలతగా చూడబడుతుంది. కనుక కుష్ఠువ్యాధితో బాటుసమాజానికి కూడా చికిత్స చేయాలి. కుష్ఠువ్యాధికి మచ్చ వస్తుంది. ఆ మచ్చ దగ్గర స్పర్శజ్ఞానం ఉండదు. ఇది శరీరానికి వచ్చే కుష్ఠువ్యాధి. ఐతే నేడు సమాజంలో చాలా మందికి మానసికమైన కుష్ఠువ్యాధి సోకివున్నది. ఆరోగ్యసమాజం అనబడే దీనిలో ఎంతో దారిద్ర్యం, అన్యాయం నెలకొనివున్నాయి. కాని ఈ నైతిక కుష్ఠురోగులు వాటిని పట్టించుకోరు. వీళ్ళ మెదళ్ళు మొద్దుబారిపోయాయి. స్పర్శజ్ఞానం కోల్పోయారు. స్పందనలేదు, వీళ్ళు చలించరు,

వీరి హృదయాలు ద్రవించవు. శారీరక కుష్ఠరోగుల కంటే వీళ్ళే ఎంతో ప్రమాదకారులు. కాళ్ళు, చేతులు లేకపోయినా బతకొచ్చుగాని ఆత్మాభిమానం లేకుండా మనిషి బ్రతకటం కష్టం' అంటారాయన. అందుకే ఆత్మాభిమానాన్ని నిలపడమే పునరావాసానికి పునాది అని అమ్టే నమ్ముతారు. అదే ఆయన ఆచరించే ఆదర్శం.

కొందరు రోగులు వ్యాధి నుంచి విముక్తులై తిరిగి తమ ఇళ్ళకు వెళతారు. అంతేకాదు. ఇనుమడించిన ఉత్సాహంతో ఆత్మస్థైర్యంతో ఏదో ఒక చేతిపనిలో నిపుణులై, విజ్ఞానం పెంపొందించుకొని నూతన జీవితాలను కొనసాగించడానికి సమాజంలోకి తిరిగి వెళ్తుంటారు. మరి కొందరు రోగులు తమ కుటుంబసభ్యులే తమను వదిలేశారని, తిరిగి ఇళ్ళకు వెళ్ళలేమనీ అందుకే తమకు ఏకైక శరణ్యమైన ఆనందవన్ లోనే ఆనందంగా కాలం గడుపుతామని అంటారు. వాళ్ళ సృజనాత్మక శక్తి, యుక్తులకు అక్కడే గుర్తింపు వుంది. వీరు ఉత్పత్తి చేసిన వస్తువులు, పదార్థాలకు ప్రత్యేక విలువ వుంది. తాము నిరర్థకులం కాము, తమ వల్ల ఇతరులకు కూడా ప్రయోజనం వుంది. తాము తింటూ ఇతరులకు పెట్టగల్గుతున్నాం అనే తృప్తి వారిలోవుంది. మానవజన్మకు అంతకన్నా కావలసిన దేముంది?

ఎంచుకోవడానికి ఎన్నో పనులు

ఆమ్టే ఆత్మీయత ఆనందవన్ లక్ష్యం ద్వారా రోగులు కేవలం పునరావాసితులు కావడమే కాదు, నవజీవన పథంలో మునుముందుకు నడుస్తున్నారు. పిల్లలకు, ముసలి వాళ్ళకు, అవిటి వాళ్ళకు, ఆరోగ్యవంతులకు ఊరటను, ఉపశమనాన్ని, తృప్తిని అందిస్తుంది ఆనందవన్. సమాజంలో పలువృత్తుల వ్యక్తులుంటారు. ఒకరిమీద మరొకరు ఆధారపడి వుంటారు. అందుకే వడ్రంగం, హస్త కళలు, ముద్రణ, వాహనాల రిపేరు, వెల్డింగు, గృహనిర్మాణం, పశుపోషణ, కోళ్ళపెంపకం, వ్యవసాయం, నూలు వడకటం, అల్లికలు, కుట్టుపని, నేత, తోలు పనులు, పాత రేకుడబ్బాలతో సామాన్లు చేయడం,

దారుశిల్పం, ఇలక్ట్రికల్ వైండింగ్, తివాచీ నేత, బొగ్గు పిడకలు, బావుల తవ్వకం, పెయింటింగు వగైరా ఎన్నో వృత్తులను రోగులే చేపట్టి అతినైపుణ్యంతో నిర్వహిస్తున్నారు.

ఇవన్నీ నియంతలెవరో పెత్తనం చెలాయించి చేయించేవి కావు. రోగులే తమకు తాముగా కొన్ని నియమనిబంధనలను ఏర్పరచుకొని వాటికనుగుణంగా నడుచుకొంటారు. నియమాలు తమ అందరి మేలు కొరకేనని గ్రహించి ఆచరిస్తారు.

ఈ స్వయంసమృద్ధ గ్రామం 120 హెకార్లకు విస్తరించి ఉంది. రోజుకు 150 లీటర్ల పాలు మిగులుతుంటే వాటిని బయటకు పంపి అమ్ముతారు. ఆనందవన్ నుంచి వచ్చే పాలు, కూరగాయాలు, హస్తకళాఖండాలను నేడు బయటి సమాజం వారు భయం లేకుండా వాడుతున్నారు. కుష్ఠురోగుల పట్ల గల భయాలను తగ్గించడానికి ఇవి వీలు కలిగించాయి. సమాజానికీ రోగులకూ మధ్యనున్న దూరం తగ్గుతుంది.

ఆనందవన్ అభివృద్ధిని గణాంక వివరాలతో కొలిసి చూడటం సబబుకాదు. కాని అలా చూసినా సంతృప్తిని ఇవ్వగలవు అవి. 1951 లో 15 వేల రూపాయల అమ్మకాలు రాగా, 1983 నాటికి 72 లక్షలకు పెరిగాయి. సమాజం నుంచి బహిష్కృతులయిన రోగులను చేరదీసి, వారి సేదదీర్చి శారీరక, మానసిక గాయాలను మాన్పి వారికి పునర్జన నిచ్చి, మట్టిలో నుంచి మాణిక్యాలను రూపుదిద్దుతున్న మహనీయుడు ఆమ్టే.

ఆయన నిర్వహణా విధానమే విశిష్ఠమైనది. కూరగాయలు పండించినా, కిరాణాదుకాణం నడిపినా, దానిలో స్వయంసమృద్దిని, లాభాన్ని ఆర్జించి, ఆ లాభాన్ని మరో ప్రాధాన్యతా రంగంలో పెట్టుబడి పెడతారు.

ఇపుడు ఆనందవన్ లో 1400 మంది దాకా రోగులున్నారు. వీరికి మంచి ఆసుపత్రి వుంది. 4 వేల మంది రోగులు బయటి నుంచి వచ్చి మందులు తీసుకువెళ్ళుతుంటారు. కొందరురోగులు కలసి ఒక గూడెంలాగా నివసిస్తారు. ఆ

గూడెంలో ఒంటరి రోగులు, కుటుంబాల వాళ్ళు వుంటారు. సుమారు వంద కుటుంబాలు గాని మూడు, నాలుగు వందల మంది రోగులు గాని వుంటారొక సమూహంగా –సమాజంలో భాగంగా ప్రతి గూడెంలో ఒక క్లినిక్, పెద్ద గోబర్ గ్యాసు పొయ్యి, సామూహిక వంటశాల సెప్టిక్ మరుగుదొడ్లు, గోడౌన్లు, కమ్యూనిటీ హాలు, పశువులపాక, నీటి సరఫరా, విద్యుత్ సరఫరా, కొంత పొలము వుంటాయి. ఇవన్నీ సమతూకంలో, సమర్ధవంతంగా నడుస్తుంటాయి. ''నేను శాస్త్రవేత్తను కాదు. అయినా నా అశాస్త్రీయ కృషే శాస్త్రీయఫలితాలను ఇస్తున్నది'' అంటారు ఆమ్టే. ఉప్పు,పంచదార, కిరోసిన్ వంటి సరుకులకు తప్ప గూడెము బయటి వాళ్లమీద ఆధారపడదు. స్విస్ దేశస్థుల సహాయంతో కొన్ని అదునాతన ఇళ్ళు నిర్మించారు.

పబ్లిక్ రంగం, ప్రైవేటు రంగం లాగా ఈ రోగుల సమూహము ఒక అనారోగ్య రంగంగా పరిగణించబడింది. కాని ఈ రంగమే జాతీయ ఆదాయాన్ని ఇతోధికంగా పెంచగలుతుతుంది. కనుక రోగులు ఎంత మాత్రమూ సమాజానికి బరువు కారు.

ఇక్కడ కుష్టురోగులేకాక వందలమంది అంధులు, మూగ-చెవుడు, పోలియోవాండ్లు, మానసికంగా ఎదుగుదల లేనివాళ్లు వున్నారు. అంధుల పాఠశాలలో ఆరుగురు ఆధ్యాపకులు కూడా అంధులే. ప్రధానోపాధ్యాయుడు ఒక విముక్తుడైన కుష్ఠురోగి, ఒక అవిటివాడు మరోఅవిటివానికి సహాయం చేస్తుంటాడు. ఇలా వికలమైన అవయవాలన్నిటినీ కలిపితే సంఘటిత శక్తి ఏర్పడుతుంది. ఆనందవన్ ఒక రెవిన్యూ గ్రామంగా ప్రకటించబడింది. అదొక చిన్న ప్రపంచం, పోస్టాఫీసు, బ్యాంకు, కమ్యూనిటీ ధియేటరు, ఉద్యానవనం, గులాబీవనం వగైరాలు ఆ గ్రామానికి అలంకారాలు.

అనాధ బాలల శరణలయం:

ఒకనాడు వరోరా రైల్వే స్టేషను దగ్గరలో ఒక గడ్డి తుప్ప చాటున ఎవరో ఒక అనాధ శిశువును పారవేసి వెళ్లారు. ఆ పాప ఏడ్పు వినపడకుండా పాపనోట్లో గుడ్డలు కూడా కుక్కారు. ఆనందవన్ లో వుండే ఒక ముసలమ్మ అటుగా వెళుతూ ఆ పాపను చూసింది. వెంటనే శిశువును ఎత్తుకొని, నోటిలోని గుడ్డలను తీసివేసి బాబా భార్య ''సాధనాతాయ్'' వద్దకు చేర్చింది. ఆ పాప ఆమె ఒడిలో మనుమరాలిగా మారింది.

ఈ సంఘటన తర్వాత అనాధ బాలలకు శరణాలయం నెలకొల్పాలనే ఆలోచన వచ్చింది. మహారాష్ట్రలోని పాఠశాల విద్యార్థినీ విద్యార్థులందరికీ విజ్ఞప్తి పంపారు. అనాధ బాలబాలికలకు ఒక శరణాలయం నిర్మించడానికి విరాళాలు పంపమన్నారు. వాళ్లు ఒక రోజు ఉపవాసం వుండి, చాక్లెట్లు, మిఠాయిలకు ఖర్చు చేయకుండా మిగిల్చిన డబ్బును విరాళంగా పంపారు. నీటి బిందువులన్నీ కలసి సింధువుగా మారినట్లుగా ఆ చిన్న మొత్తాలే మూడున్నర లక్షల రూపాయలయ్యాయి. వాటితో యాభై మంది అనాధ పిల్లలకు వసతినిలయం ఏర్పరచారు.

మిత్ర సమ్మేళనం:

ప్రతి ఏటా ఫిబ్రవరి మొదటి వారంలో ఆనందవన్ లో ఒక వింతైన సదస్సు జరుగుతుంది. దానినే మిత్రసమ్మేళనం అంటారు. దేశం నలుమూలల నుండి, విదేశాల నుండి కూడా అన్ని రంగాలలోని ప్రముఖులు, ఆమ్టేజీ అభిమానులు సుమారు వెయ్యిమంది దాకా కలిసే సమావేశం అది. వీరంతా రెండు రోజులు అక్కడే ఆనందవన్ నివాసులతో కలసివుంటారు. వ్యాధి నుండి విముక్తులయిన రోగులు కొందరు పెళ్ళిళ్ళు చేసుకుంటారు. ఈ కార్యక్రమ భాగాన్ని 'మంగళాక్షతలు' అంటారు.

నృత్యం, గానం, ఆటల పోటీలు జరుపుతారు. వనమహోత్సవంలో మొక్కలు నాటతారు. అలంకరించిన పల్లకిలో మొక్కలను మేళతాళాలతో

ఊరేగిస్తూ తెస్తారు. వాటిని నాటతారు. ప్రశాంత వాతావరణంలో చర్చలు జరుపుతారు. పలు కార్యక్రమాలతో ఆ రెండు రోజులూ రెండు గంటలుగా గడిచిపోతాయి.

రైల్వేస్టేషను దగ్గరలో దొరికిన అనాధ బాలికకు 'ధర్తి'' అనే పేరు పెట్టారు. ఆ పాపకు అన్నప్రాశన 1980లో మిత్రసమ్మేళనం సందర్భంగా చేశారు. అంజని, మధుసూదన్ అనే రోగ విముక్తులైన దంపతులు ఆ పాపను ఆ రోజే దత్తతగా తీసుకున్నారు. ధర్తి అమ్మ ఒడిలో చిరునవ్వులు చిందిస్తూ వుంది. సాధనాతాయ్ అన్నం మెత్తగా కలిపి ఆ చిన్నారి పెదవులకు అందించింది. "ఇక్కడ నాకు స్వేచ్ఛ వుంది, స్నేహితులున్నారు. చేయడానికి చేతినిండా పనివుంది. నావల్ల ఇతరులకు కొంత మేలు జరుగుతుంది. నా అవసరం వుంది. ఇందువల్ల నాకు గొప్ప తృప్తి లభిస్తుంది. ప్రతిరోగి కూడా మానవుడే కదా. ఇక్కడ నాకు మానవుడిగా తృప్తి మిగులుతుంది, నా జీవితంలో గతంలో పోగొట్టుకొన్న దానిని తిరిగి పొందగలుగుతున్నాను''.

ఎందరికో ప్రేరణ

ఈ శతాబ్దంలో కుష్ఠురోగుల సంక్షేమం కొరకు కృషిచేసిన సంఘసేవకులు ఎవరూ బాబా ఆమ్టేకు సాటిరారు అనుకోవచ్చు. చెస్టర్ టన్ అన్నట్లుగా మనం పురాతన శిధిలాలు, కోటలు, భవనాలను చూసి చర్చించుకుంటాం. 'ఈ నల్లని రాలలో ఏ గుండెలు దాగెనో' అని ఉత్తేజితుల మవుతాం. కాని ఎదురుగా కనిపించే మానవ శిధిలాల గురించి మనం ఏమీ పట్టించుకోము, వాటినుంచి ఏమీ గ్రహించము' అంటారు.

కాని ఆ మానవశిధిలాలను కళాత్మకంగా పేర్చి ప్రయోజనాత్మకంగా కూర్చి చూపుతున్న ఆమ్టే అభినందనీయుడు. ఆయన సాధించిన అసాధ్యాలను చూసి నిశ్చేష్టులైన వాళ్ళు,ఆ మహాప్రేరణ ద్వారా ప్రభావితులైన ప్రముఖులు ఎందరో వున్నారు. మరాఠీ రచయిత పి.యల్. దేశ్ పాండే అంటాడు 'సందర్శకులు ఆనందవన్ కు వస్తుంటారు. బలహీనపడిన తమ మనోవిద్యుత్

ఘటాలను (బ్యాటరీలను) చార్జిచేసుకు వెళతారు అని. ఇంగ్లాండు దేశపు యువకుడు అర్ధస్ టర్నోస్కీ గాధ వింటే ఈ మాటలు అక్షరాలా యదార్థమని తెలుస్తుంది.

ధృఢకాయుడైన 'ఆర్దస్ ' కు పోలియో వచ్చింది. అతని రెండు కాళ్ళు చచ్చుపడి పోయి అతని స్వాదీనంలో లేవు. కొండంత భవిష్యత్ జీవితం మంచులా కరిగిపోయింది. అతని కలలు కల్లలయ్యాయి. ఆ ఆఘాతాన్ని తట్టుకోలేక పోయాడు. ఒక చక్రాలకుర్చీలో కూర్చుంటే ఎవరో ఒకరు దాన్ని నెట్టుకుపోవాలి. నిన్నటిదాకా పరుగులు తీసిన పాదాలు, అతివేగంగా సైకిలు తొక్కిన కాళ్ళు తన స్వాధీనంలో లేవని తెలుసుకొని తీవ్రమానసిక అశాంతికి లోనయ్యాడు. ఆ అశాంతిని పోగొట్టుకోవాలని, ప్రశాంతతను కనుగొనాలని ప్రపంచపర్యటన ప్రారంభించాడు. 20 దేశాలు తిరిగాడు. ఎవరు చెపితే అక్కడకు వెళ్లాడు. మునులు తపస్సు చేసుకొనే ప్రశాంత హిమాలయాలకు గూడా వెళ్లాడు. కాని ఎక్కడా శాంతి లభించలేదు.

ఎవరో చెప్పగా ఆనందవన్ కు వచ్చాడు. ఆమ్టేజీని కలుసుకున్నాడు. ఆయన నిర్మించిన విజయసోపానాలను అవలోకించాడు. అంతే అతని అన్వేషణ ఫలించింది. ప్రయాణం ఆగిపోయింది. ఆ ప్రేరణలో 'నలగని బాట' అనే పుస్తకం వ్రాశాడు. తాను చూసిన బాబా ఆమ్టే వంటి వ్యక్తుల గాధల సంకలనమే ఆ పుస్తకము. ఆ పుస్తకంపైన లభించిన ఆదాయం మొత్తం ఒకటిన్నర లక్షల రూపాయలను ఆమ్టేకు అప్పగించాడు. ఆ డబ్బుతో వివిధ రకాల వికలాంగులకు స్వయం ఉపాధి శిక్షణాసంస్థను నెలకొల్పారు. దాని పేరు ' సంధి నికేతన్'.

ఆనందవన్ లో అన్ని పనులూ ప్రత్యేకతలే. ఇక్కడ శవఖననం కూడా అంతే. ఒక రోగి చనిపోతే అతను నమ్ముకున్న మతాచారాన్ని బట్టి అతనిని పూడ్చి పెట్టడమో, కాల్చడమో చేస్తారు. అతని జ్ఞాపకంగా ఒక మొక్కను నాటి పెంచుతారు. ఈ విషయమై ఆమ్టే కుమారుడు డాక్టరు వికాస్ ఇలా అంటాడు.

''మేమందరము సైనికులమై కుష్ఠువ్యాధి అనే శత్రువుపైన పోరాడాము. యుద్ధంలో మా పక్షం గెలిచింది. మా మృత వీరులను మేము మరచిపోలేము' అని.

ఒకసారి ప్రధాని ఇందిరాగాంధీ, నాటి మహారాష్ట్ర గవర్నర్ సతీమణి బిల్కీస్ లతీఫ్ లు కలిసి వచ్చి ఆనందవన్ ను సందర్శించారు. బాబా వాళ్ళకు చెట్లు, పుష్పాలను గురించి వాటి ద్వారా మనం నేర్చుకోవలసిన అంశాలను గురించి చెపుతూ శ్రోతల ప్రతిస్పందనను గమనించటానికై ఆగాడు. బిల్కిస్ ఇంకా వివరాలు చెప్పమని కోరింది. మరికొంతసేపు అదే విషయమై చెప్పి ఇందిరాగాంధి వైపు చూశాడు.

ఆమె కూడా చలించినట్లు కన్పంచింది. అపుడు బాబా ''మీ కంటిలో సుడి తిరిగి బయటకు రాలేకుండావున్న ఆ భాష్పబిందువును కుష్ఠురోగుల సంక్షేమము కొరకు కుదువ పెట్టమని కోరుతున్నాను'' అన్నాడు.

నిర్మాణాత్మక కృషి లేని రాజకీయ చైతన్యం నిర్వీర్యమైనది. రాజకీయ చైతన్యం లేని నిర్మాణాత్మక కృషి గూడా నిస్తేజమైనదే. సృజనాత్మక మానవత్వమే నా మతము; నా మార్గదర్శి' అంటాడు ఆమ్టే. ''మార్క్స, మావో, రస్కిన్, కోపోట్కిన్, ఠాగూర్, గాంధీ రచనలు నన్ను ప్రభావితం చేశాయి. కాని ఏ ఒక్క సిద్ధాంతానికి నేను దాసుడనుగాను, అంధవిధేయుడను కాను''.

'గాంధీశకం నన్ను ఎక్కువ ప్రభావితుడ్ని చేసింది. మన దేశంలో అత్యధిక ప్రజానీకం నోరులేని మూగజీవులే. కనీసం వాళ్ళ బాధలను, భయాలను కూడా బయటకు చెప్పుకోవడం చేతగాని వాళ్లు. అలాంటి వాళ్ళు కూడా స్వయంవికాసానికి త్యాగాలు, ప్రయత్నాలు చేయటం నా కళ్ళారా చూశాను. స్వాతంత్ర్యానంతరం కూడా పెల్లుబికిన ఉత్సాహంతో, మొక్కవోని దీక్షతో కృషి చేశారు. అయితే రాను రాను ఆచరణ తగ్గుతుంది. 'దేవుని పది ఆజ్ఞలను చిలుక పలుకులుగా చెప్పినంత మాత్రాన నీవు ప్రవక్త మోసెస్ వు కాలేవు. ఈ మాటలు మనకు అలవాటు అయిపోయాయి. 'మార్క్స ఇలా అన్నాడు' 'లెనిన్ ఇట్లా చెప్పాడు'. అనే సూక్తులు తరచు వింటుంటా. ఎవరేమన్నా ఒక వర్గాన్ని

తొలగించినంత మాత్రాన సమస్యలు లేకుండా పోవు. రష్యా,చైనా, నాయకులు చాలా చిన్న స్థాయి నుంచి పైకెదిగిన వాళ్ళే. అయినా హీనమైన దౌర్జన్యకాండలు, నరహింసలు జరిపింది పెట్టుబడిదారులు కాదు. అధికారంలోకి వచ్చిన శ్రామికులే. మనిషిని మనిషిగా రూపొందించటం ఎట్లా? అనే మౌలిక ప్రశ్నకు వాళ్ళు జవాబు చెప్పలేదు'' అంటాడు ఆమ్టే.

ఆనందవన్ లో ఒక ప్రాచీన సూక్తి వ్రాసి వుంది.

''అంతరాత్మ అన్వేషణలో అలసి పోతిని తిరిగి తిరిగి
అయినా కనిపించలేదు అంతరాత్మ
పరమాత్మను పట్టుకుందామని ప్రయత్నించాను పదేపదే

ఆ దృశ్యాన్ని శ్రద్ధగా చూస్తున్నాను. ప్రఖ్యాత సంగీత కళాశారుడు, గాయకుడు వసంతరావ్ దేశపాండే ఒక గీతం అలపించాడు. ఆ సందర్భం కొరకై ప్రత్యేకంగా ఒక ప్రొఫెసరు వ్రాసిన పాట అది.

అమ్మ ప్రేమకు సాటి అవనిలో లేదు
తల్లిలేని బిడ్డలకు తల్లి ఈ 'సాధన'
ఆ ప్రేమను పంచుకునే పాపలు ఎందరో
ఆమెసన్నిధిలోన అవిటి బిడ్డలు ఎందరో
మమతానురాగాలు అందించు ఈ మాత
ఆనందాన్ని పంచి ఇచ్చును ఈ తల్లి.

బాబా దృష్టి సునిశితమైనది. ఒక అంథభాలిక ఒకసారి గులాబివనంలో పూవును పట్టుకోబోయింది. ఆమె వేలికి ముల్లు గుచ్చుకుంది. రక్తపుచుక్కలు రావడం ఆమ్టే చూశాడు. ఆయనకొక ఆలోచన వచ్చింది. ముళ్ళులేని గులాబి దొరికితే బాగుంటుంది. కళ్ళు లేని వాళ్ళు కూడా చేతితో తడిమి చూస్తూ దాని అందాన్ని, వాసనను ఆస్వాదించవచ్చు ననుకున్నాడు. ముఖ్యమైన స్నేహితులకు కొందరికి ఈ ఆలోచన తెలియజేశాడు. కొన్నాళ్లకు బొంబాయి నుంచి ఒకరు

ముళ్ళులేని గులాబి అంట్లను సేకరించి తెచ్చారు. వాటిని గులాబితోటలో ఒక పక్కగా నాటారు. అవి దినదిన ప్రవర్ధ మానమౌతున్నాయి.

బయటి నుంచి సహాయం వీలయినంత తక్కువ వుండాలని ఆమ్టే ఆశయం. అయితే శాశ్వత ప్రాజెక్టులకు, పెద్దపనులకు మొదట్లో కొంత మూలనిధి అవసరమవుతుంది. భవననిర్మాణానికి, సామగ్రికి, పెట్టుబడికి అవసరమైన సహాయాన్ని అంగీకరిస్తాడు. కాని తాత్కాలిక ప్రయోజనం నెరవేరితే చాలునని యోచించడు. ఒకసారి 'శాంతి కోసం ఆహారం' అనే విదేశీసంస్థ వారు ఆనందవన్ కు చాలా ఎక్కువ మొత్తాల్లో గోధుమలను ఉచితంగా ఇస్తామన్నారు. బాబా ఆ ప్రతి పాదనను వినయంగానే తిరస్కరించాడు. "శాంతి కొరకు ఆహారం" అన్నారు, బాగుంది. కాని మీ గోధుమలు ఉన్నంతకాలమే శాంతి కూడా ఉంటుందేమో? ఇంతకంటే గోధుమలను బాగా పండించటం, అధిక దిగుబడులను సాధించడం ఎట్లాగో మాకు నేర్పండి. ఆ టెక్నిక్‌ను ఇవ్వండి. శాంతి చిరకాలం కొనసాగుతుంది" అన్నాడాయన.

స్విట్జర్లాండ్ ప్రజల సహకారంతో రేకుడబ్బాలు తయారు చేసే కర్మాగారాన్ని నెలకొల్పారు. అది బాగా లాభాల్లో నడుస్తుంది. ఆ డబ్బుతో మరికొన్ని కాలేజి భవనాలను నిర్మించారు.

ఆమ్టే గారికి తోడుగా ఆనందవన్ ను చూస్తున్నది ఆయన పెద్దబ్బాయి డా. వికాస్. ఈ సంస్థకు మెడికల్ డైరెక్టరుగా రోగుల వైద్యఅవసరాలను చూడటమే గాక అవసరమైతే లారీ డ్రైవరుగా, తోటమాలిగా, మెకానిక్ గా అన్నికార్యక్రమాలనూ పర్యవేక్షిస్తుంటాడాయన. వికాస్ భార్య డాక్టర్ భారతి ఆయనకు చేదోడుగా వుంటుంది.

అద్భుత విజయాలు

ఏ వాస్తుశిల్పులూ, ఇంజనీర్లు, కాంట్రాక్టర్ల తోడ్పాటు లేకుండానే జాగృతులు, చైతన్యవంతులైన అవిటివారే మహాసౌధాలను నిర్మించారు. చేతులకు వేళ్ళు లేనివాళ్ళే చేనేత పనివాళ్ళుగా మారారు. ఒకనాటి కుష్ఠురోగులే నేడు లైసెన్స్

పొంది డ్రైవర్ గా భారీవాహనాలు నడుపుతున్నారు. నడవటానికి రెండుకాళ్ళు లేని వ్యక్తి మూడుచక్రాల సైకిలుపై తిరుగుతూ ఒక పారిశ్రామిక విభాగాన్ని నిర్వహిస్తున్నాడు. గత అనుభవం ఏమీ లేనివాడే అచ్చుయంత్రం నడుపుతున్నాడు. అలాగే ఒక చెయ్యి మాత్రమే ఉన్న క్యాషియరు ఉన్నాడు. ఒకనాటి టైలరే నేడు గురువుగా కుట్టుపని నేర్పుతున్నాడు. పొరుగు గ్రామాల నుంచి కూడావచ్చి అతని వద్ద కుట్టుపని నేర్చుకుంటున్నారు. ఇలా అవిటివాళ్ళ అద్భుత విజయాలు ఎన్నయినా చెప్పవచ్చు. అన్నిటి వెనక ఉన్న బలమైన అంశం నాణ్యత. చేతితో చేసిన గ్రీటింగు కార్డులు, చెక్కతో మలిచిన హస్తకళాఖండాలు. పోటీలలో మేటిగా పాలిచ్చే ఆవులు, మేలురకపు విత్తనాలు అన్నిటి వెనక నాణ్యత స్పష్టంగా కన్పిస్తుంది.

సమాజ వికాసం, సమాజ అభివృద్ధి అనేవి ఆమ్టే గారు సల్పిన బహుముఖకృషికి చాలా చిన్న మాటలు. ఒక వంక వ్యక్తికి స్వేచ్ఛ వుంటుంది. మరోవైపు సార్వత్రిక యాజమాన్యం కొనసాగుతుంటుంది. ఈ రెండింటిలోని సుగుణాల సమ్మేళనమే ఇక్కడ కనిపిస్తుంది. సివిల్, మిలటరీ ఉద్యోగాలు చేసి రిటైరు అయిన ఉద్యోగులు 25 మంది దాకా ఒక బృందంగా'ఉత్తరాయణ్' లో వుంటారు. వీరినే 'విజ్ఞాన నిధులు' గా వర్ణిస్తారు. వీరు కూడా ఎవరికి చేతనయిన పని వాళ్ళు చేస్తుంటారు.

కుష్ఠురోగులకు వైద్య సౌకర్యాలు అందించడంలో, పరిశోధన చేయడంలో మనదేశంలో ఎన్నో గొప్ప కేంద్రాలున్నాయి. వాటితో పోలిస్తే ఆనందవన్ చాలా వెనకబడి వున్నట్లే. కాని అటువంటి కేంద్రాలలో రోగిని ఒక మనిషిగా చూసేవి తక్కువ. వాళ్ళకు ఒక్కొక్క రోగి ఒక సంఖ్యగా గుర్తుంటాడు. 16 వ నంబరు మంచం మీద రోగి, 3 వబ్లాకులో రియాక్షను రోగి, ఇలా పరిగణిస్తారు, పలకరిస్తారు. ఇక్కడ అలాకాదు. ఆత్మవిశ్వాసాన్ని పెంచుతూ రోగుల కోసం రోగులే పనిచేసుకుంటూ అతి తక్కువగా బయటి సహాయాన్ని ఆశిస్తారు. పోలియో బాధితుడు సదాశివ టాజనే అనే కుర్రవాడి మాటలు విందాం. 'నేను కాళ్ళు,

చేతుల మీద పారాడుతూ ఒకజంతువులాగా జీవితం గడిపేవాణ్ని. ఇక్కడకు వచ్చాక చాలా పనులు నేర్చుకున్నాను. నాకు మరో జన్మ వచ్చింది అనుకుంటున్నాను. 'సంధినికేతన్' లో పూలతోటను పెంచే వ్యక్తి ఇలాఅన్నాడు ''బయటి ప్రపంచం నన్నొక ధూళికణంలా చూసింది. ఇక్కడ ఈ తోటలోని పూలూ,మొక్కల మధ్య నేనూ వాటిలో ఒక భాగంగా ఎంతో సంతోషంగా ఉన్నాను''.

అంధవిద్యార్థుల పాఠశాల ప్రిన్సిపాల్ వైశంపాయన్ మాటలు విందాం. ''నేను 1988 లో ఇక్కడకు వచ్చాను. అంతకు ముందు బొంబాయిలో ఒక కుష్ఠురోగుల శరణాలయంలో ఉన్నాను. అక్కడ జైలు గోడల మధ్య నిర్బంధంగా వున్నట్లు వుండేది. ఊరక పెట్టే అన్నపు మెతుకుల కోసమే అక్కడపడి ఉన్నట్టుండేది.

37 టు 40 పేజీలు లేవు

ఫలితం దక్కలేదు, పలుకూ ఉలుకూ లేనే లేదు.
అన్నదమ్ముల కోసం ఆక్రందించాను
అంతరాత్మ, పరమాత్మ, అన్నదమ్ములూ
ముచ్చటగా మూడింటినీ కనుగొన్నాను – ఒక్కసారే ఒక్కచోటే –
''భారతదేశంలో ఆలోచనలు కాగితాల మీదనే రూపం దాల్చుతాయి. ఆచరణలోకి రాకుండానే అంతరించి పోతాయి కూడా'' అంటారు ఆయన. తాను మాత్రం అందుకు విరుద్ధంగా తక్కువ మాట్లాడి ఎక్కువ చేసి చూపించే చేవ గలిగిన మనిషి. అందుకు మరో మహానిదర్శనమే సోమనాథ్ పథకం.

సోమనాథ్ పథకం

సోమనాథ్ ప్రాజెక్టుకు 1966 నలోనే చంద్రపూర్ సాంద్రఅరణ్యం మధ్య అంకురార్పణ చేశారు. ఆమ్టేకు ప్లానింగ్ కమీషను వారు రెండు వేల ఎకరాల అడవిని కేటాయించారు. ఇది నాగపూర్ కు 100 కి.మీ. దూరంలో ఆగ్నేయంగా

వుంది. మరుసటి సంవత్సరమే దేశంలో అన్ని ప్రాంతాల నుంచి విద్యార్థి సేవాదళ కార్యకర్తలను అక్కడకు ఆహ్వానించాడు. వాళ్ళు 15 రోజులు శిబిరంలో శ్రమించి 25 ఎకరాలలో తుప్పలు కొట్టి, గోతులు పూడ్చి సాగుకు అనుకూలంగా మార్చారు. దీనితో స్థానిక రాజకీయ నాయకుల కళ్ళుకుట్టాయి. ఆ ప్రాంతపు వాళ్ళను రెచ్చగొట్టారు. మీ పొలాలను ఆమ్టే కాజేస్తున్నాడని నూరిపోశారు. దాంతో ఆమ్టేకు వ్యతిరేకంగా ఉద్యమం లేచింది.

అప్పుడు సర్వోదయనాయకుడు వినోబాభావేను మధ్యవర్తిగా పిలిపించారు. ఆయన ఆమ్టేకు నచ్చచెప్పాడు. 700 ఎకరాలను., అందులోని సహజ నీటివనరులైన వాగువంకలను వదులుకోమని సూచించాడు బొమ్మ. అందుకు అంగీకరించాడు ఆమ్టే.

నీటి వనరులు లేకపోయేసరికి బాబా ఆలోచనలకు, ప్రణాళికలకు విఘాతం తగిలినట్లయింది. అయినా మొక్కవోని దీక్షతో ఆయన బృందం కృషి సాగించింది. ఏటేటా కొంత పొలాన్ని సాగులోకి తీసుకు వస్తున్నారు.

చెట్లు నాటటం, పోషించటం సామాజిక ప్రాధాన్యతగా గుర్తించి ప్రోత్సహిస్తున్నారు. 'ఒక్కొక్క వృక్షం ఒక స్వేచ్ఛా స్థంభము,స్థూపము – ప్రతి పత్రమూ ఒక గౌరవపతాకం అంటారు ఆమ్టే తన కవితా శైలిలో.

శారీరకశ్రమ వల్ల మనసు నిర్మలమౌతుందని విశ్వసించే బాబా కృషి వల్ల సోమనాథ్ కూడా క్రమంగా విస్తరించింది. మేలు రకపు విత్తనాల ఉత్పత్తి, ఉద్యానవనాలు, పెరటి తోటల పెంపకం, పాడిపశువులు, మేకలు, పందులు, గొర్రెల పెంపకం కొనసాగిస్తున్నారు.

ఇక్కడ 450 మంది పైగా రోగులు,రోగ విముక్తులు వుంటున్నారు. వీరంతా కలసి అక్కడ కొండవాగుపైన 100 అడుగుల పొడవు ఆనకట్టను,కట్టి దాదాపు 800 ఎకరాలు సాగుచేస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు 1981-82లో ఖర్చు రెండు లక్షల డెబ్బై ఐదు వేలు కాగా ఆదాయం ఐదు లక్షలముప్పై రెండు వేలు. దీన్ని మొత్తాన్ని పర్యవేక్షించేది శంకర దాదా అనే ఒక మాజీ రోగి.

అక్కడ ఆధునిక వ్యవసాయం పద్దతులను అమలు చేస్తున్నారు. సోమనాథ్ క్షేత్రాలలో పొరుగు పొలాలకంటే నాలుగైదు రెట్లు అధిక దిగుబడులు వస్తున్నాయి. దగ్గరలోని పంజాబ్ రావ్ కృషి విద్యాపీఠ్ పరిశోధనా క్షేత్రాలు ఖాళీగాను, పంటలు ఎండిపోతూ లక్షల రూపాయలు నష్టాలను తెస్తున్నాయి. అక్కడ సాంకేతిక పరిజ్ఞానం, సిబ్బంది, అన్నీవున్నా ఫలితాలు సున్నా. సోమనాథ్ లో కార్యదర్శి, మేనేజరు, కార్యనిర్వాహకులు ఎవరూ లేరు. అందరూ శారీరకంగా అవిటి రోగులే. అయినావాళ్ళు మానసికస్థైర్యంతో బంజరుభూముల్లో బంగారు పంటలు పండిస్తున్నారు. రోజూ టొమాటోలు, చిలగడ దుంపలు వంటి కూరగాయలను ట్రాక్టర్లతో సమీపమార్కెట్లకు తోలి అమ్మగలుగుతున్నారు. ఈ సందర్భంలో బాబా మాటలు సమంజసంగా కనిపిస్తాయి. ''మేధావులు, విద్యావంతులు జరిపే సదస్సులు, సమావేశాలు, స్వయం తృప్తికోసం చేసే పనులే. దీపావళి టపాసులు, తారాజువ్వలు అందంగా వుంటాయేగాని అన్నం వండటానికి పనికిరావు. అభివృద్ధి కావాలంటే మేధావులకు,సామాన్యులకు కోట్లాది అట్టడుగు వర్గాలకు మధ్య సమగ్రసహకారం వుండాలి.

అడవుల సేద్యంపై ఒక ఉద్గ్రంధాన్ని రచించిన 'రాబర్ట్ హార్ట్' ఇలా అన్నాడు. ''బాబా ఆమ్టే ప్రపంచమానవుల్లో ఒక అరుదైన వ్యక్తి. ఆయన సాధించిన విజయాలు ఏ రాజకీయనాయకుడూ సాధించిన వాటికంటే కూడా విశిష్ఠమైనవి. బి.బి.సి. ఆర్థికశాస్త్రవేత తన గ్రంథం ''విజేతలను మించినవారు'' లో 'మ్టే చేస్తున్నది అద్భుతం' అని ప్రశంసించాడు.

అశోకవన్

ఇవిగాక నాగపూర్ కు దక్షిణంగా పది కిలోమీటర్ల దూరంలో 1957 లో స్థాపించబడి ఇప్పటివరకు బాబా ఆమ్టే చేత సమర్థవంతంగా నిర్వహించబడుతున్నది అశోకవన్. ఇక్కడ 100 ఎకరాల పొలంలో వందమంది పైగా రోగులు జీవనాన్ని కొనసాగిస్తున్నారు. చికిత్స సదుపాయాలు, శిక్షణ,

పునరావాసం విభాగాలు వున్నాయి. ఇది కూడా స్వయంసమృద్ధమైన కేంద్రమే. ఆధునిక పద్ధతులలో వ్యవసాయం చేస్తూ, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలను నడుపుతున్నారు.

గిరిజనుల సేవ

ఆమ్టే దృష్టిని ఆకర్షించిన మరోకార్యక్షేత్రం గిరిజనాభ్యుదయం. దండకారణ్య ప్రాంతంలోని బస్తర్ అడవిలో తాను బాల్యంలో చూసిన మడియా, గోండ్ అదిమ తెగల ప్రజల అమాయకత్వం, నిజాయితీలు ఆయనను ఆకర్షించాయి. వాళ్ళ సంస్కృతి, పరిసరాలు, సంప్రదాయాలు, విలువలు అన్నీ నాగరికత పాదాల క్రిందపడి నలిగిపోతుంటే ఆయన వ్యధ చెందాడు. చాలినంత తిండిలేక, రోగాల పాలయి, కీళ్ళనొప్పులు మలేరియా, లివర్ జబ్బులతో తరచు మరణాలకు గురవుతున్న ఈ జాతి అంతరించి పోతుందేమోననిపించింది.

వారిమతం జంతుమతం. పులులూ, పాములూ, వారి ఆరాధ్యదైవాలు. ప్రకృతిని పురుషరూపంలో గాని మరో రకంగా కాని ఆరాధించడం కూడా తెలియదు. విజ్ఞానము, శాస్త్రము తొంగిచూడటానికి వీలులేని కీకారణ్యం మధ్య కాపురము, భూతాలు, దెయ్యాలంటే భయం. మంత్రగాళ్ళంటే గౌరవం. మశూచివంటి అంటువ్యాధులు వస్తే దేవతలకు మొక్కేవాళ్ళు. పండుగలు, పబ్బాలలోను వారి జీవితాలలో తాటి, జీలుగు, కల్లు కుండలు ఒక భాగం. విప్పపూల సారా విందులలో తప్పనిసరిగా వుండాలి. శరీరాన్ని దాచుకోవలసిన అవసరమే వుండదను కొంటారు. నామమాత్రంగా ఒక గోచి గుడ్డను పెట్టుకుంటారు పురుషులు. అడవాళ్ళు మోకాళ్ళ వరుకు పొట్టి చీరలు ధరిస్తారు. రవికెలు వుండవు.

వేటాడి జీవించేదశ నుండి వ్యవసాయం చేసి జీవించే దశకు వాళ్ళు మారుతున్న సంధి కాలమిది – చాలామందికి పొలాలు లేవు. నాగలి అంటే ఏమిటో కూడా తెలియదు. కొందరికి పొలాలున్నప్పటికీ స్థిర వ్యవసాయం

చేయడం తెలియదు. పోడుసాగు చేస్తారు. అంటే ఈ ఏడు ఒక చోట ఆదరాబాదరా దున్ని విత్తనాలుచల్లి అడవులను నరికి కొత్తభూములను సాగు చేస్తారు. ఒక సారి పండిన దాంట్లో మళ్ళీ వేస్తే పండదని వాళ్ళ నమ్మకం. ఈ రకం వ్యవసాయం వలన అటవీసంపద అంతరించి పోతుందని ప్రభుత్వం అటవీ రక్షకభటులను నియమించింది.

గత్యంతరం లేక గోండ్ లు ఏది దొరికితే అది తిని ఆకలి తీర్చుకొనేవాళ్ళు. ఎలుకలు, ఉడుతలు, కోతులు, కొండ పిల్లులు, చేపలు, ఉసిళ్ళు అనే పురుగులు వగైరాలు. దుంపలు దొరికితే వాటిని వుడికించి గటక, గంజి కాచుకొని త్రాగుతారు.

ఇక వీళ్ళను దోచుకొనేవాళ్ళు ఎందరో .ఎన్ని విధాలుగానో. రోడ్డుపనులు చేయించుకొని కూలి తక్కువ ఇచ్చే అధికారులు, కంట్రాక్టర్లు. శిస్తులరూపంలో పీడించి పిండుకొనే పట్వారీలు. జననాలో,మరణాలో నమోదు చేయలేదనే కొంటెసాకుతో లంచాలు లాక్కునే లాఠీలపోలీసులు. వీళ్ళ వనరులను హరింపచేస్తూ కనీస అవసరాలైన ఉప్పువంటి సరుకులను కూడా అధిక ధరలకు అమ్మే దళారులు.

ప్రభుత్వం ద్వారా వారికి అందే సౌకర్యాలు, లభించే సహాయాలు నామమాత్రమే. అవి అధికారుల అంకెల గారడీలలోనే కనిపిస్తాయి. ఎక్కడో ఒకపెద్ద గూడెంలో పాఠశాల వుంటుంది. అది కూడా ఎండకూ, వానకూ రక్షణ ఇవ్వలేని పాకలో వుంటుంది. దానిలో పంతుళ్ళు ఉండరు. ఉన్నా పాఠాలు చెప్పరు. ఏ బీడిఆకుల వ్యాపారమో చేస్తూ, గిరిజనులకే పెట్టుబడి పెట్టి సరుకు అప్పణంగా కాజేస్తుంటారు.

ఆ అమాయక గిరిజనులకు వైద్యం చేసేది గూడెంలోని మాంత్రికుడే. ఆధునిక వైద్యం కావాలంటే 60-70 మైళ్ళు వెళ్లాలి. సంవత్సరంలో అయిదారు నెలలు బయటి ప్రపంచంతో సంబంధాలే ఉండవు. కొన్ని ప్రాంతాలకు, డొంకలు,

దారుల గుండా వాగులు వంకలు పారుతూ ఎద్దుల బళ్ళు కూడా వెళ్లే వీలు కాదు. గ్రామపంచాయితీలకు కూడా రేడియో లేని రోజులవి.

మృత్యువు ఎప్పుడూ వారి వెన్నంటి వుండేది. ఏ రక్త పింజేరియో, అడవి త్రాచో, తాటి మిన్నాగో కాటు వేయవచ్చు. తేళ్ళు, మండ్రగబ్బలు సరేసరి. ఎలుగుబంట్లు చీల్చి చెండాడవచ్చు. కొండ తేనెటీగలు వెంటాడి కుట్టవచ్చు. ఉన్నట్టుండి ఉప్పెనలా వచ్చే వరదలో,కారుచిచ్చులో జీవితాలను కబళించవచ్చు. వీటన్నిటినీ మించినది మెదడుకు వచ్చే మలేరియా, ఇది వచ్చిన పది గంటలలోపు సరయిన వైద్యం దొరకకపోతే మరణం తధ్యం.

చలికాలంలో చలికి ఆగలేక మంటలు వేసుకొని, ఆ మంటల పక్కనే నిద్రపోతారు. నిద్రలో పక్కకు దొర్లితే వళ్ళు కాలిపోతుంది. తగినంత పోషకాహారం లేక 40 ఏళ్ళ వాళ్ళే 70 ఏళ్ళ వృద్ధులుగా కనిపిస్తారు.

1973 ఆఖరులో ఆమ్టే, ఆయన కుమారుడు వికాస్ నేగపల్లిలో ఒక గుడారం వేసి వైద్య ఆరోగ్య కార్యక్రమాలు ప్రారంభించారు. త్వరలో చిన్న కొడుకు డా. ప్రకాష్ వచ్చి కలిశాడు. ఆయన నాగపూర్ లో శస్త్ర చికిత్సలో యం.యస్. చదువుతూ మానేసి వచ్చాడు. ఒక ఏడాది తరువాత డా. ప్రకాష్ భార్య డాక్టరు మందాకిని వచ్చి చేరింది. ఆమె ఆపరేషను సమయాల్లో మత్తు ఇవ్వడంలో నిపుణురాలు. మనం సాధారణంగా వింటుంటాం. తరానికి తరానికి మధ్య అంతరం వుంటుందని, కాని ఇది బాబా ఆమ్టే కుటుంబ సభ్యులలో కనిపించదు.

1975 లో వ్యవసాయ క్షేత్రాలు 'హేమల్ కసా' లో ఏర్పాటు చేశారు. గౌతమి, ఇంద్రావతి నదుల మధ్య 50 ఎకరాల పొలం ప్రభుత్వం ఇచ్చింది. మహారాష్ట్రకు చెందిన నలుగురు విద్యావంతులైన యువకులు, ఆమ్టే కుమార్తె రేణుక అక్కడపనులు చూడసాగారు. ప్రక్కన చెరువులో నీరు మార్చి నెలదాకా సరిపోయాయి. మళ్ళీ మరల వర్షాలు పడేవరకు రెండుమైళ్ళదూరంలో నది నుంచి ఎద్దులబండి మీద పీపాలతో మోసుకు రావలసి వచ్చేది. డాక్టరుప్రకాష్ వైద్యశాలను ఒక గుడారంలో ప్రారంభించాడు. నూతన వైద్యవిధానంలో అంతగా

నమ్మకం లేని గిరిజనులు క్రమంగా రాసాగారు. ఫలితాలు బాగుంటున్నాయి. రోగుల బాధలు త్వరగా సులువుగా తగ్గడం కళ్లారా చూసేసరికి నమ్మకం కుదిరింది. రోగుల సంఖ్య పెరగసాగింది.

ఇక రాత్రనక పగలనక దూరాన్నుంచి కూడా కాలినడకన బండ్లమీద,మనుషులు మోసే డోలీల మీద రోగులను తీసుకువచ్చే వారు. మందులు బయటినుంచి విరాళాల రూపంలో వచ్చేవి. కాని అవి సరిపోవు.

ఒకసారి ప్రకాష్, ఒక రోగిని చూడటానికి కొండ పక్క గూడెంకు వెళ్లాడు. వెంట కుటుంబ సభ్యులు కూడా వున్నారు. తిరిగి వచ్చేదారిలో వాళ్ళందరిని కొండ తేనెటీగలు విపరీతంగా కుట్టాయి. రక్తపువాంతులు అయ్యాయి. ఒకరు ఎలాగో గూడెము చేరుకున్నారు. గ్రామస్తుల సహాయముతో అందరూ ఆస్పత్రికి చేరారు. అక్కడ సకాలంలో వైద్యం జరగటం వల్ల ప్రాణాలతో బయటపడ్డారు.

ఇటుకలను స్వంతంగా తయారు చేసుకొన్నారు. ఆనందవన్ నుంచి కొందరు రోగులు వచ్చి, ఇటుకలతో రెండు ఇళ్ళు కట్టారు. ఒకటి డాక్టరు కుటుంబానికి, రెండోది సిబ్బందికి. రోగులకు ఒక పాకా వేశారు. వీలున్నపుడు గిరిజనులు గూడేలకు వెళ్లి వారి జీవనవిధానాల లోతులను ఆచార వ్యవహారాల అవధులను పరిశీలించారు. వాళ్ళ భాషలను నేర్చుకున్నారు. మరాటీ మాటలకు గోండ్ అర్థాలను, గోండ్ మాటలకు మరాటీ అర్థాలను సులువుగా తెలుసుకొనే వీలుగా అక్షరక్రమంలో నిఘంటువులను తయారు చేసుకొన్నారు.

సాధారణంగా పిల్లల్లో గ్రహణశక్తి ఎక్కువగా వుంటుంది. మడియా పిల్లలు కూడా దానికి మినహాయింపు కారు. కాని పాఠ్యపుస్తకాలలోని అంశాలు వాళ్ళకు తెలియవు. వాళ్ళ సంస్కృతిని, తాతల, తండ్రుల సంస్కారాలను తెలుసుకొని వాళ్ళు గర్వించగల విద్య కావాలి. వాళ్ళకు అలాంటి విద్య నేర్పాలి. వాళ్ళ నిత్య జీవితాలు, పండుగలు, పబ్బాలు, ఆచార వ్యవహారాలు పరిసర జంతుజాలాలు ఆధారంగా ప్రయోజనకరమైన కొత్త పాఠాలను తయారు చేశారు.

మడియా – గోండ్ అనేవాళ్ళు రెండు విడివిడితెగలకు చెందిన వాళ్ళు. వీళ్ళు ఒకరితో మరొకరు కలవరు. దూరదూరంగా తిరుగుతారు. ఈ అంతరాన్ని తగ్గించటానికై ఒక ఆలోచన అమలు చేశారు. బడిలో చదువుకొనే ఒక మడియ పిల్లవాడు నెలకు ఒక గొండ్ పిల్లవాడిని తన ఇంటికి తీసుకెళ్లాలి. ఆ రాత్రి అన్నం పెట్టి తనతో ఉంచుకోవాలి. అలాగే వీళ్ళు వాళ్ళింటికి వెళ్లాలి. క్రమంగా పిల్లల్లో, యువకుల్లో, పెద్దల్లో మార్పు రాసాగింది. బడిలో పాఠాలు చెప్పే విధానం నియత, అనియత విధానాల మిశ్రమంగా రూపొందించారు. చదువుతోపాటు, నృత్యం, సంగీతం, చేతిపనులు, వడ్రంగం నేర్పించారు.

ఈ గిరిజనాభ్యుదయ కార్యక్రమానికి 'లోక్-బిరదారి' అని నామకరణం చేశారు. అంటే 'సోదర ప్రజ' లేక 'ప్రజల్లో సోదర బావం' అని అర్థం. ప్రజలతో కలసి నివసించి వారితో కలసి పనిచేసే ఉద్యమం ఇది. బాబాకు యువతపై గల అత్యంత విశ్వాసానికి ఈ పథక విజయం మరో తార్కాణం. స్విస్ దేశపు మిత్రుల సహాయంతో ఆసుపత్రిని అభివృద్ధి పరిచారు. మెల్లమెల్లగా అధికదిగుబడి విత్తనాల ద్వారా ఆధునిక వ్యవసాయపద్ధతుల ద్వారా సాగుచేయడం అలవాటు చేశారు.

గోండ్ ల జీవితాలలో వెలుగు ఆరంభమయింది. వాళ్ళకు కావలసిన ఆహారధాన్యాలను వాళ్ళే స్వయంగా పండించుకోగల్గడంటో వారిలో నూతన ఆశలు, సరికొత్త సంతృప్తి కన్పించాయి. ఇళ్ళ చుట్టూ పందిళ్ళకు కూరగాయల పాదులు అల్లించారు. ఆకుకూరల మడులు పెంచారు. ఒక ధాన్యాగారాన్ని నిర్మించారు.

ఒక ఆశ్రమపాఠశాలను నిర్వహించారు. రాత్రిబడి ద్వారా వయోజనులను అక్షరాస్యులను చేశారు. లాహిరి, నెల్ గుండ, కోఠి, హిండూర్, మున్నగు చోట్లకు కార్యక్రమాలను విస్తరించారు. వీటిలో కొన్నిటికి 50 కిలో మీటర్ల దూరంలో గూడా కరెంటు, టెలిఫోను సౌకర్యాలు లేవు.

ముందుచూపుతో ఆహారపదార్థాలను, మందులను వర్షాకాలానికి సరిపడా నిల్వ ఉంచుకొన్నప్పటికీ ఒకోసారి కొరత ఏర్పడేది. అత్యవసరంగా ఏవో కొన్ని

కావలసి వచ్చేవి. అప్పుడు యువకులు కొందరు వర్షాల్లో తడుస్తూ, బురదలో నడుస్తూ, వాగుల్లో ఈదుకుంటూ బయటి ప్రపంచంలోకి వెళ్లి తలమీద మూటలతో సామాను తరలించుకు వచ్చేవాళ్ళు. అంతకు మించి మరో మార్గము లేదు.

ఏడాదిలో ఐదారు నెలలు మాత్రమే రాకపోకలు చేయవీలుగల ఆమారుమూల ప్రాంతంలోని ఆటవిక ప్రజలను ఆప్యాయతతో ఆదరిస్తున్న తీరుకు విదేశీయులు నివ్వెరపోయారు. డాక్టరు ప్రకాష్ ను గూర్చి ''మేము ఇక్కడ మరో ఆల్బర్ట్ ష్విడ్జర్'' ను చూస్తున్నాం'' అన్నారు.

పక్కనున్న వాగుకు ఆనకట్ట కడితే నీటి సమస్య తీరుతుంది. ఒక ఇంజనీరు సహకారంతో అందుకు ప్లాను తయారు చేశారు. 100 మంది స్త్రీ, పురుషులు పది వారాలపాటు పని చేశారు. తొమ్మిది అడుగుల ఎత్తు 135 అడుగుల పొడవు 12 అడుగుల వెడల్పు ఉన్న కట్టను నిర్మించారు. అదనపు నీటిని వదలటానికి ఆ ఆనకట్టలో 11 లాకులు కూడా ఏర్పరిచారు.

ఇపుడు ఆసుపత్రికి అనుబంధంగా దూరప్రాంతాలలో 7 క్లినిక్ లను సమాజ వికాస కార్యకర్తలు నిర్వహిస్తున్నారు. వీరు వైద్యమేకాక గిరిజనుల సమగ్ర అభివృద్ధికి పాటుపడుతున్నారు. గిరిజనులకు వారి కర్తవ్యాన్ని బోధించి, వాళ్ళ హక్కులను విశదపరచారు. దీనిలో 100 కి.మీ. విస్తీర్ణంలో 300 చిన్న, పెద్ద గ్రామాలు నవజీవనపథంలో పయనించ ప్రారంభించాయి. శతాబ్దాల తరబడి అంధకార బంధురమైన సొరంగంలో జీవిస్తున్న వారికి సుదూరంగా వెలుగురేఖలు కన్పించసాగాయి.

అభివృద్ధి పేరుతో ఆనకట్ట

కాని ఆ వెలుగురేఖల వెంటనే మరో ప్రమాదం ముంచుకు వచ్చింది. అక్కడి గోదావరి, ఇంద్రావతి నదులకు ఆనకట్టలు కట్టి జలవిద్యుత్ కేంద్రాలు నిర్మించాలని తలపెట్టింది ప్రభుత్వం. మూడు రాష్ట్రప్రభుత్వాలు, కేంద్రప్రభుత్వం కలసి ఈ ప్రాజెక్టును అమలు చేయాలనుకున్నాయి. అదే అమలుజరిగితే రెండులక్షల ఎకరాల పొలం నీటిలో మునిగిపోతుంది. అందులో సగం అడవి

ప్రాంతం వుంది. కనీసం 40 వేల మంది గిరిజనులను తమ స్వస్థానాల నుంచి తొలగించి వేయాలి. మరెన్నో చెట్లు మట్టిపాలవుతాయి. ఈ సంపదకంతటికి ఎన్ని కోట్ల నష్టపరిహారం చెల్లించగలరు?

ఆమ్టే ఆవేదన చెందాడు. ఇది సంస్కృతిని హత్య చేయడం గాక మరొకటికాదు అని ఎలుగెత్తి అరిచాడు. ఆ ప్రాంతమంతాతిరిగాడు. మడియల జీవితాలు చూసి, వాళ్ళకు జరుగుతున్న అన్యాయాలను తెలుసుకొని ఆపాదమస్తకం చలించాడు. ప్రదర్శనల ద్వారా, ఊరేగింపుల ద్వారా తన నిరసనను తెలియపరిచాడు. ప్రభుత్వాలు దిగివచ్చాయి. ఆయన వాదనలోని సత్యాన్ని అర్థం చేసుకొని ప్రాజెక్టు ప్రతిపాదన విరమించుకొన్నాయి.

ఇన్ని అద్భుతాలను చేసిన ఆమ్టేను కూడా విమర్శించే వాళ్ళు లేకపోలేదు. వాళ్ళుఅనేది ఒకటే 'బాబా నియంతలాగా పనులు శాసిస్తాడు అని . అదైనా నిజం కాదు. ఆయనొక ఆదర్శనాయకుడు. ఆయన వచ్చాడంటే ఏ ప్రాజెక్టు దగ్గరయినా రోగులు, అక్కడ నివసించే వాళ్ళు వరుసన నుంచుంటారు. తప్పకుండా ఆయన అందరినీ పలుకరిస్తాడు. పరామర్శిస్తాడు. వారు చేసే పని ఎంతవరకు వచ్చిందో తెలుసుకొంటాడు. ఏమైనా సమస్యలు వున్నాయోమో విచారిస్తాడు.

విమర్శకుల గురించి ముచ్చటిస్తే ఆయన అంటారు. 'కాయలు లేని చెట్టుకు రాళ్ళు ఎవరు వేస్తారు? మధురమైన ఫలాల బరువుతో కొమ్మలు వంగిపోతాయి. అలా కొమ్మలు వంగాలని, కాయలు కోసుకోవాలని ఎదురుచూసే వారెంతో మంది వుంటారు' అని.

అనారోగ్యం

బాబా సహనాన్ని పరీక్షించడానికి అన్నట్లు అనారోగ్యం ఆయన వెన్నంటి వుంటుంది. నిరంతర శారీరక శ్రమ, ఆనందవన్, సోమనాధ్, హేమల కసాల మధ్య జీపు ప్రయాణం, కంకర రోడ్లు, గతుకుల దారులు, డొంకల్లో ప్రయాణాలు చేయడంలో ఆయన వెన్నెముక దెబ్బతిన్నది. కొంతకాలం బెల్టు వేసుకున్నాడు. అయినా ప్రయోజనం లేక మెడ దగ్గర రెండువెన్నుపూసలను తొలగించి కృత్రిమ

ఎముకలను అమర్చారు. ఏడేళ్ళ తరువాత మరో 5 ఎముకలు దెబ్బతిన్నాయి. వీపు దిగువ ప్రాంతంలోని వాటిని తొలగించారు. అది చాలా క్లిష్టమైన వెన్నెముక ఆపరేషన్. అది జరిగాక బాబా ఏ మాత్రం కూర్చోలేదు. పరుండి వుండాలి లేదా నిలుచోవాలి, అంతే.. అందువల్ల ఒక వ్యానులో పరుండేందుకు పడకను అమర్చారు. దానిలో ప్రయాణం చేస్తాడు.

ఇలా వున్నప్పటికీ ఆయన ఉదయమే రోజూ పది కిలోమీటర్లు కాలినడక నడిచేవాడు. 1981 జనవరిలో ఆయన ఇలా నడచి వస్తుండగా ఒక రోడ్డుప్రమాదం జరిగింది. పుర్రె ఎముకలు దెబ్బతిన్నాయి. చాలాకాలం ఆసుపత్రిలో వుండి కోలుకున్నాడు. తిరిగి వచ్చిన ఒక నెల రోజులకే సోమనాథ్ పోతుండగా మళ్ళీ ప్రమాదం జరిగింది. అయినా కోలుకున్నాడు. ఆయన మనోనిబ్బరం, సంకల్పబలం అంత గొప్పవి. ''నేను వెన్నెముక లేని మనిషిని' అంటాడు నవ్వుతూ ఆయన. అంత బాధను భరిస్తూ కూడా నవ్వుతూ హుషారుగా వుంటాడు. నా బాధలు ముందుగా చెప్పిరావు. కాని నా పనులు మాత్రం ముందుగా చెప్పివస్తాయి అంటారు. పని, కర్తవ్యము, బాధ్యతలకు అంత ప్రాధాన్యత ఇస్తారాయన. అందుకే ఆయన అంటారు ''నేను గనుక ఇప్పుడే చనిపోతే నా సమాధి మీద ఒక మూలన రెండు అడ్డగీతలు గీయండి చెక్కు వ్రాసి క్రాస్ చేసినట్లుగా. ఆ మధ్యలో 'బాధ్యత – బదిలీ చేయడానికి వీలులేనిది' అని చెప్పిన వ్యక్తి అని రాయండి అని.

ఆవును ఆమ్టే జీవితమంతా బాధ్యతాయుతమైనదే. బాధ్యతలను స్వీకరించడం, సవాళ్ళను ఎదుర్కోవడం,విజయాలను స్వీకరించడం, ముందుకు సాగడం ఆయనకు అలవాటైపోయాయి. ఈ వయస్సు లోనూ ఉత్సాహంగా పని జేస్తాడు. కొత్త ప్రణాళికలకు రూపకల్పన చేస్తాడు. కొత్త కలలకు రేఖలు,రంగులతో రూపాలు ఇస్తుంటాడు. యువకేంద్రం, సార్వత్రిక విశ్వవిద్యాలయం, విద్యార్థి శిబిరాలు, తాను సృష్టించిన 'సృజనాత్మక మానవత'కు మెరుగులు దిద్దుతుంటారు.

విప్లవకారులు, త్యాగమూర్తులు ఎందరోవున్నారు. కాని ఆమ్టే పథకాలు అమలు జరిగే అన్ని చోట్లా వినిపించే సజీవ స్వరాలను కనిపించే ఉత్తేజ జీవన చిత్రాలను ఏ త్యాగాలూ, విప్లవాలు సృష్టించ లేవు. సంఘసేవకులలో అగ్రగామియైన ఆయన అతి సాదా ఖద్దరు బనీను, పైజమాలో పది రూపాయల లోపు ఖరీదు చేసే పాత టైరు ముక్కల చెప్పులతో,చేతి కర్రతో సాటిలేని ఉత్సాహంతో సాగాడు ముందుకు.

ఆమ్టే తన భావాలను కవితల రూపంలో వ్యక్తం చేయగల మంచికవి గూడా. ఆయన రాసిన ఆరుకవితా సంకలనాలు మరాటీలో, ఒకటి హిందీలో వెలువడ్డాయి. అందులో ఒకటి పలు విశ్వవిద్యాలయ విద్యార్థులకు,బోర్డుల చేత పాఠ్యగ్రంథంగా నిర్ణయించబడింది.

సన్మానాలు సత్కారాలు

గౌరవపురస్కారాలు, సన్మానసత్కారాలు ఎన్నెన్నో ఆయన్ను వరించి వచ్చాయి. అయితే వాటితో తృప్తపడిగాని, వాటి పట్ల ఆకర్షితుడై గాని ఆయన విశ్రాంతి తీసుకోలేదు.

భారత ప్రభుత్వము 1971 లో పద్మశ్రీ ఇచ్చింది. 1978 లో రాష్ట్ర భూషణ్ తో సత్కరించారు యఫ్.ఐ.ఈ. సంస్థ వారు. 1979 లో జమునాలాల్ బజాజ్ అవార్డు; 1980 లో నాగపూర్ విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్; ఆ ఏడే వికలాంగులకు సమాన అవకాశాలు కల్పించే జాతీయ సంస్థ 'దీవాన్ అవార్డు' ఇచ్చారు. 1981 లో పంజాబ్ రావ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ''కృషి రత్న'' ను ఇచ్చింది. ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ వారు అవార్డు అందించారు.

1983 లో ''డామియన్ –డట్టన్ అవార్డు'' లభించింది. ప్రపంచంలో కుష్ఠురోగులకు విశిష్ఠ సేవలు చేసిన వ్యక్తికి ఏటా ఇచ్చే ఈ బహుమతి ఆ రంగంలో గొప్పది. దీనిని పొందిన భారతీయులలో ఈయన రెండవ వారు. ఇంతకు

ముందు కుష్ఠువ్యాధి శాస్త్రవేత్త డాక్టరు ధర్మేంద్రకు ఇచ్చారు. ''రాజాజీ రత్న'' "రామ శాస్త్రి" అవార్డులను కూడా ఈ ఏడే అందుకున్నారు ఆమ్టే.

1985 లో మధ్యప్రదేశ్ ప్రభుత్వ పరిసరాల అభివృద్ధికి ఇచ్చే '' ఇందిరాగాంధి స్మారక అవార్డు'' ను ఇచ్చింది. ఆగష్టు లో ఆసియాలో నోబెలు బహుమతికి సమానంగా పరిగణించే రామన్ మెగసేసె అవార్డును ఉత్తమ ప్రజాసేవకుడిగా గుర్తించి ఇచ్చారు. అప్పుడు బాబా రోడ్డు ప్రమాదం వల్ల నడవలేని స్థితిలో వుండగా కుమారుడు వికాస్ ఆమ్టే మనిలాకు వెళ్ళి బహుమతి స్వీకరించాడు.

1982 లో ఇంగ్లాండుకు చెందిన బర్బరావార్ట్ జాక్సన్ అనే ప్రఖ్యాత ఆర్థిక శాస్త్రవేత్తకు అంతర్జాతీయ అవగాహనకు ఇచ్చే ''నెహ్రూ అవార్డు'' ఇచ్చారు. దానితో పాటు ఆమెకు లక్ష రూపాయల నగదు ఇచ్చారు. ఆమె ఆ నగదు మొత్తాన్ని ఆమ్టేకు ఇచ్చి వేసింది. అంతేకాదు ''ఆమ్టే మహావిశిష్టమైన భారతీయుడు, ఒక మహర్షి'' అని ప్రశంసించింది. ఆయన పేరును నోబుల్ శాంతి బహుమతికి సిఫారసు చేసింది కూడా.

ఈ మానవమూర్తి కొన్ని పదవులను కూడా నిర్వహించి, ఆ పదవులకు కీర్తిప్రతిష్ఠలు చేకూర్చాడు. గాంధీ మెమోరియల్ కుష్ఠుఫౌండేషన్ ఛైర్మన్ గా, జాతీయ కుష్ఠు ఆర్గనైజేషన్ సంస్థాపక సభ్యునిగా, ఛైర్మన్‌గా, మహారాష్ట్ర ప్రభుత్వ కుష్ఠునివారణ సలహామండలి సభ్యునిగా వున్నారు. నాగపూర్ విశ్వవిద్యాలయ సెనెట్ సభ్యులుగా బాధ్యతలు నిర్వహించారు. భారతప్రభుత్వ ఆరోగ్య విద్యాశాఖలకు సలహాదారునిగా వున్నారు. మహారాష్ట్ర సహకార బ్యాంక్ డైరక్టరుగా పనిచేశారు. ఇంకా ఎన్నోన్నో పదవులు నిర్వహించారు. ఆయన ఎక్కడున్నా ఉత్తేజభరితంగా మారుతుంది వాతావరణం. ఆమ్టే సూచనలు ముక్కుసూటిగా వుంటాయి. ఆయన విమర్శలు నిశితంగా వుంటాయి. సలహాలు నిర్మాణాత్మకంగా వుంటాయి. ఇతరులనుంచి మంచి సూచనలను స్వీకరించడానికి బిడియపడడు ఆయన.

1986 లో జాతీయ సమగ్రతా సంఘం, అలహాబాద్ వారిచే ''జాతీయ సమగ్రతా అవార్డు'', ''సుంకు కెనెరా స్మారకఅవార్డు'' కుష్ఠురోగులకు విశేషసేవలనందించినందుకు ''మాషియొ ప్లాటినమ్ జూబిలీ అవార్డు', మానవసేవలో ఉత్తమవ్యక్తిగా అభివర్ణిస్తూ 'రాజా రామామోహన రాయ్ టీచర్స్ అవార్డు' లభించాయి.

మెగసేసే అవార్డు ప్రదానోత్సవంలో ఆయన సముచిత రీతిలో ఇచ్చిన జవాబు:

ఆసియాలో ప్రజాసేవకు ఇచ్చే ప్రతిష్ఠాత్మక సత్కారాన్నినాకు ఇస్తున్నందుకు ఆనందంగా వుంది. గిరిజన మడియా యువకుడు వేసిన బాణంలాగా సూటిగా, సూర్యకిరణంలా మీ ముందుకు వచ్చి మీకు ధన్యవాదాలు చెప్పాలని వుంది. కాని నేనిక్కడ బాధలతో బంధింపబడివున్నాను. నా తరపున, ఆనందవన్ లోని నా పెద్దకుటుంబ సభ్యులందరి తరపున కుష్టుపీడితులు,వికలాంగులు, అంధులు, బధిరులు, అనాధలు, నిరాశ్రయులు అందరి తరపున – మీ సత్కారాన్ని అందుకోవటానికి నా కుమారుడిని పంపుతున్నాను.

రామన్ మెగసేసే స్మారక అవార్డును అందుకోవడం నా అదృష్టం. ఆయన మహానాయకుడు, ప్రజల మనిషి. ప్రజల ఆత్మాభిమానం, స్వేచ్ఛా, సార్వభౌమాధికారాలలో సంపూర్ణ విశ్వాసంగల వ్యక్తి. కనుకనే ప్రజల స్వరాన్ని వినగల ప్రభుత్వాన్ని నెలకొల్పాడు. ప్రభుత్వం ఎల్లప్పుడు నేర్పుగా ప్రజల గాయాలను మాన్పుతూ, వాళ్ళ కన్నీళ్ళను తుడుస్తూ వుండాలి. రామన్ మేగసేసే ఆదర్శం అదే. ఆయన జీవితకాలంలో అచరించిందీ, వ్యక్తపరచిందీ దానినే'.

అశక్తత వల్ల నేను నిస్పృహతో వున్నాను. పేరు ప్రఖ్యాతులు గలవాడిగా వుండటం కంటే ఆరోగ్యవంతుడిగా వుండటమే మేలు. ఒక పక్క బాధతో కనీళ్ళుసుడులు తిరుగుతున్నా చిరునవ్వు నవ్వగల

గొప్పశక్తిని భగవంతుడు నాకు ఇచ్చాడు. ధైర్యము, ఆత్మవిశ్వాసము నాకున్న పదునైన ఆయుధాలు, అవే నాకు పటిష్టమైన కవచాలు కూడా.

ప్రజాసేవ అంటే నీవు పనిచేసే గంటల సేవే కాదు. నీ జీవితాన్ని, అనుభవాలను పెనవేసుకు పోవాలి అది. ప్రజలు నిన్ను నమ్మడానికి ముందుగా నీకు ఎన్నో పరీక్షలు పెడతారు.

వేలాది కుష్ఠురోగులు శారీరక అశక్తులు, వికలాంగులు బయట ప్రపంచంలో జరిగేది తెలియని బధిరులు, అంధులు, మూగవాళ్ళు, నిరాశల పీడిత సోదరులు, ఆకలితో పేగులు మెలికలు తిరిగే అన్నార్తులు, అమాయకత్వం, అసహ్యాల వల్ల హృదయాలు అంధకారమయమైన వాళ్ళు, తరతరాల నుంచి ప్రతిఘటన అంటే ఏమిటో తెలియని ఆటవిక ప్రజలు, వీరంతా ఎలుగెత్తి పిలుస్తుంటే పట్టించుకోక పోవడము, ఆ కేకలను పెడచెవిన పెట్టటమే పాపము. నేనెప్పుడూ ఆ పాపం చేయదలచుకోలేదు.

మోజారిటీ ప్రజలు మౌనం పాటించడం ప్రజాస్వామ్యానికే ప్రమాదం.

నేను భారతదేశం మధ్యగల అటవికులైన మడియా గిరిజనులతో వుండాలని కోరుకున్నాను. వీరిపట్ల నాకున్న ప్రేమ నా కలుషితహృదయాన్ని పరిశుభ్రపరచింది. నా ఆవయాలను పునీతం చేసింది. ఇతరులతో గల సంబంధబాంధవ్యాలను మధురతరంగా మార్చింది. నేను చేపట్టిన పనులను మహిమాన్వితం చేసింది. నా జీవితంలోని విషాదఛాయామయ అగాధాన్ని తేజోమయ ఉన్నత సూర్యోదయంగా మార్చింది.

జీవిత చరమదశలో సాయంసంధ్య వెలుగులో తడబడే అడుగులు వేస్తున్న వాళ్ళు, నిజాయితీగా పండించిన చివరిపంట ఫలితాల కోసం ఎదురు తెన్నులు చూసేవాళ్ళు, మిగిలివున్న కొద్ది ఆయుఃకాలంలో తమ జీవితాలకు నవ్యతను సమకూర్చుకోవాలని అనిశ్చిత ఆత్మవిశ్వాసంతో

ప్రయత్నించే వాళ్ళు, భయంకర ఏకాంతంలో బ్రతుకు లీడ్చేవాళ్ళు ఎంతోమంది వున్నారు. వాళ్ళ ఒంటరి సుదీర్ఘ జీవిత యాత్రలో సహచరుణ్ని కావాలనుకొన్నాను.

నేనొక క్రీస్తు, డామియన్, గాంధీల సమకాలీనుడను కావాలనుకుంటాను. క్రీస్తు శరీరాన్ని శిలువకు కొట్టినపుడు మేకులు చేసిన గాయాలను-డామియన్ చేతుల మీద, గాంధీజీ రొమ్ము మీద చూశాను. కుష్ఠరోగిని చూస్తున్నపుడుఅతని నుదుటి మీద క్రీస్తు ముద్దుపెట్టిన గుర్తులు నాకు కనిపిస్తాయి.

''నా రెక్కల్లో శక్తిలేదు. హృదయం అలసిపోయింది. సంకల్పం స్థిరంగా లేదు. వెన్నెముక విరిగి పోయింది. ఐనా సుదీర్ఘ ప్రయాణాలు చేయడానికి, అనిశ్చిత స్థితులను ఎదుర్కొనడానికి అలసట లేదు'' అని మెకెన్ టైర్ అన్నట్లుగా మానవుని మంచి కొరకు సమైక్య సమాజాన్ని రూపుదిద్దటంలో పాలు పంచుకుంటాను.

సేవ ఏదైనా సరే సమర్థవంతంగా వుండాలంటే, శాశ్వతవిలువ గలది కావాలంటే, దానిని ప్రేమతో సమ్మేళనం చేయాలి. నీ కృషి అంటే ఇతరులకు కనిపించే నీ జీవితమే. ప్రజాసేవలో నీ ఆశయసాధనకు ప్రాణాలనే పణంగా పెట్టవలసి వుంటుంది. నీకు ఇష్టాలు, కోరికలు, ఆనందాలు వుండగూడదు. యుద్ధంవల్ల భూమి రక్తంలో తడిసిపోతుంది. బాధితప్రపంచం నీ శ్రద్ధకొరకై వేడుకొంటున్నది. నీవు దాన్ని ప్రేమతో కరుణతో తడిపి వేయాలి. మంచి సంకల్పం, అంకిత భావం మాత్రమే సరిపోవు. వినూత్న విలువలను కనుగొంటూ, వాటిని అంగీకరిస్తూ, నూతన భావాలను అన్వేషించాలి. ఈ సత్కారం నన్ను మరింత ప్రగాఢంగా అంకితమయ్యేలాగా చేస్తుంది.

'మరోసారి మీ అందరికి కృతజ్ఞతలు తెలుపమని నా హృదయాన్ని పెదవుల వద్దకు పిలుస్తున్నాను. అశక్త ప్రపంచపు బాధితమానవాళి శ్రద్ధాంజలిగా అందించే కన్నీటి బిందువును స్వీకరించండి'.

ఈ సన్మానం గురించి ఆయన అంటారు 'సేవలందుకునే వారి ముఖాలపై చిందే చిరునవ్వులకు మించిన బహుతులు ఏవీ లేవు. కుష్టువ్యాధిని గూర్చిన ఒక నూతన సామాజిక సువార్తను మనజాతికి ప్రచారం చేసే అవకాశం కల్గిస్తుంది. ఈ బహుమతి. ప్రజాసేవలో ఉషోదయాన్ని, చిరునవ్వులను మేళవించడానికి నన్ను ఉత్తేజితుడ్ని చేస్తుంది 'ఈ సన్మానం.'

నిధుల సేకరణ

అంతకు ముందు ఆనందవన్ మరియు అనుబంధ ప్రాజెక్టులకు ఒక కోటి రూపాయల మూలనిధిని సమకూర్చాలని మహారాష్ట్రలో పలు రంగాలలో ప్రముఖులు కొందరు పయత్నించారు. అందుకై ప్రఖ్యాత నేపధ్య గాయని లతా మంగేష్కర్ పాట కచేరీని ఏర్పాటు చేశారు. అనుకున్నంతగా పరిస్థితులు అనుకూలించలేదు. అయినా 35 లక్షల రూపాయలు వసూలయ్యాయి. ఆ మొత్తాన్ని నిల్వ వుంచి వడ్డీని ఏటేటా కార్యక్రమాల నిర్వహణకు వాడుతున్నారు.

తన పనులు తాను చూసుకుంటూ బయట ప్రపంచాన్ని గురించి పట్టించుకోకుండా నూతిలో కప్పలాగా ఉండడు బాబా.

దేశ సమైక్యత కోసం

నిన్నటి దాకా అస్సాంలో జరిగిన అల్లర్లు, నేడు పంజాబు లోని హింసాకాండ దేశసమైక్యతకే ముప్పు కలిగించేవిగా వున్నాయి. ప్రజలు తమ నిరసనను వ్యక్తం చేయటానికి హింసామార్గాన్నే అవలంభిస్తున్నారు. ఉద్యమాలు చిలికి చిలికి గాలి వానలవుతున్నాయి. స్వాతంత్ర్యపు పునాదులను కదిలిస్తున్నాయి.

స్వేచ్ఛా వాయువులనే కలుషితం చేస్తున్నాయి. ఈ పరిస్థితులపట్ల సామాన్య మానవుడే కలత చెందుతుంటే ఇక బాబా ఆమ్టే విషయం చెప్పవలసిందేముంది?

భారతీయులు ఆనాడు బ్రిటిష్ వాళ్ళను దేశం వదలి పోండని గర్జిస్తూ 'క్విట్ ఇండియా' అనే ఉద్యమాన్ని నడిపారు. తరువాత మహమ్మదీయులు తమకు ప్రత్యేక దేశం కావాలని, భారత్‌ను విభజించమని 'స్ప్లిట్ ఇండియా' ఉద్యమం నడిపారు. ఇపుడు కుల, మత, వర్గ వైషమ్యాలతో, దురహంకారాలతో దేశం ముక్కలయ్యే ప్రమాదం ముంచుకు వస్తుంది. 1984 నవంబరులో ఢిల్లీలో కొట్లాటలు అమానుషంగా జరిగాయి. ఇవన్నీ చూశాక దేశసమైక్యతను కాపాడవలసిన అవసరాన్ని గ్రహించాడు. 'నిట్ ఇండియా' అనే ఉద్యమం కావాలి అనుకొన్నాడు. దానినే 'భారత్ జోడో' యాత్రగా ప్రారంభించాడు.

125 మంది పైగా యువతీ యువకులు కన్యాకుమారి నుండి 1985 డిసెంబరు 24న సైకిళ్ళ మీద బయలుదేరారు. ఆమ్టే నడుం బిగించి తన వ్యానులో ముందు వెళ్తూ మార్గం చూపాడు.

ఆ యాత్ర 13 రాష్ట్రాలు, ఢిల్లీలో గుండా 5 వేలకు పైగా కిలోమీటర్ల దూరంలో కాశ్మీరు వరకు కొనసాగి 95 రోజుల తరువాత జమ్ములో 1986 ఏప్రియల్ 9 న ముగిసింది. అదొక అపూర్వ యాత్ర. దారిద్ర్యంతో నిండిన గ్రామాలు, దుమ్ము రోడ్లు, క్రిక్కిరిసి కనీసఅవసరాలు తీరని పట్టణాల గుండా సాగింది. ఇందులో ఆరుగురు డాక్టర్లు, 15 మంది యువతులు, పలువురు విద్యార్థులు, ఒక అడ్వకేటు, ఒకరిటైరు అయిన అధికారి పాల్గొన్నారు. ఉద్యోగులు 100 రోజులు శలవు పెట్టి వచ్చారు.

ప్రతిరోజు ఉదయమే ఫలహారం చేసియాత్ర ప్రారంభిస్తారు. భారత అఖండతను కోరుతూ నినాదాలు చేశారు, పాటలు పాడారు, ఆగిన చోటమొక్కలు నాటారు. రాత్రిళ్ళు స్లైడ్సు ప్రదర్శించారు. పరిసరాల పరిశుభ్రత గూర్చి జాగరూకులను చేస్తూ ప్రసంగాలు చేశారు. ఒక్కొక్క పథికుడు ఒక్కోచోట తన

అనుభవాలను, జాతీయ సమైక్యత ఆవశ్యకతను గురించి మాట్లాడే అవకాశం ఇచ్చారు.

యువతరంలో నేడు నెలకొనివున్న నైరాశ్యాన్ని తొలగించుకొని వాళ్లంతా నిర్మాణాత్మక కృషిని దేన్నయినా చేస్తారని బాబా ఆమ్టే ఆకాంక్ష. ఈయాత్ర రాజకీయ లక్ష్యంతో చేపట్టినది కాదు. 'మనకు మనమే ఐక్యమవుదాం'. అనే సందేశాన్ని చాటటమే లక్ష్యం. 'కొందరి శరీరాలుఆరోగ్యంగానే వున్నాయి. కాని వాళ్ళ మనసులు అనారోగ్యంగా పుళ్ళతో, గాయాలతో నిండి వున్నాయి. వాళ్ళు దేశానికి భారంగా వున్నారు. వారి గాయాలను యువతరం మాత్రమే మాన్పగలదు' ''ఎల్లెడలా ప్రబలిన హింస, అయిష్టత, ఆడంబరం, లంచగొండితనం, దారిద్ర్యం, అన్యాయం చూసి భవిష్యత్తు అంటే భయపడుతున్నారు భారతీయులు. ఈ ఉద్యమం మనలోని శత్రువులపైన పోరాడటానికే''.

పరదేశీయులను మన దేశంనుండి పారద్రోలితే వాళ్లతో పాటే కుల, వర్గ, భాష, మతపరమైన విభేదాలన్నీ కూడా పోతాయని స్వాతంత్ర్యం రాకముందు అనుకున్నాం. కాని ఇపుడు అవన్నీ మరంత శక్తి పుంజుకున్నాయి. ఈ అసమానతలకు, బేధాలన్నిటికి దారిద్ర్యమే కారణం అంటారు కొందరు. కాని గుజరాత్, పంజాబ్యం స్వయంసమృద్ధి చెందటమే కాక మిగులుకూడా సాధించాయి కదా. మరి అక్కడ సోదరభావం కనపడదే? హింస, అస్థిరతలు నెలకొని ఉన్నాయేం? అని ప్రశ్నిస్తాడు ఆమ్టే.

పంజాబ్ గుండా వెళ్ళడం ప్రమాదకరమని బాబాను శ్రేయోభిలాషులు హెచ్చరించారు. అయినా లెక్కచెయ్యకుండా వెళ్లాడు. అక్కడ కర్ఫ్యూ అమలులో వున్నప్రాంతాల్లో కూడా తిరిగాడు. 'భారతజాతికి ఎముకకు తగిలేటంత లోతుగా గాయంఅయింది. దీనిని మాన్పడానికి ప్రయత్నించడానికైనా నేను వెళ్లాలి' అంటూ బాబా ముందుకు వెళ్లాడు.

మన సోదరులకు, మహిళలకు జాతీయ రహదార్లు మరుగుదొడ్లుగా ఉపయోగపడుతున్న దుస్థితిని చూసి ఆవేదన చెందాడు.

''ఏ మతమయినా అమాయక ప్రజల అసువులను బలిగొనడానికి అంగీకరించదు, ఉగ్రవాదాన్ని అనుమతించదు. కత్తికి, త్రిశూలానికి ఘర్షణలు జరిగితే సమైక్యతకే ముప్పు వాటిల్లుతుంది. పంజాబ్ సమస్య బుల్లెట్లు, కమీషనుల వల్ల పరిష్కారం కాదు. శాంతి సందేశమే అందుకు మార్గం' అంటాడీ మానవతావాది.

భారత్ జోడో యాత్రలో పాల్గొంటూ కార్యకర్తలుపాడిన పాటలు ఇలా ప్రతిధ్వనించాయి.

జాతి భేదమును వదిలెయ్
బారత జాతిని కలిపెయ్
ధర్మభేదము వదిలెయ్
భారతజాతిని కలిపెయ్
భాషా భేదం వదిలెయ్
చేతులు కలుపుదు నిర్మాణానికి
హింసా, దోపిడి వద్దేవద్దు
హిందూ, ముస్లిం, సిక్కు, క్రైస్తవులం
అంతా అంతా అన్నదమ్ములం
కాశ్మీరు నుంచి కన్యాకుమారిదాకా
కొచ్చిన్ నుంచి గౌహతి దాకా
ఏ ప్రాంతమైనా, ఏ భాగమైనా
మనదే దేశం, మనదే మాత.

సన్మానాలు:

ఆయనకు ఈ యాత్రలో ఉండగానే మూడు సన్మానాలు లభించాయి. 'బజాజ్ రత్న' ఒకటి. జాతీయస్థాయిలో వికలాంగుల సంక్షేమానికి ఇచ్చే అవార్డు

ఒకటి. ఇక భారత ప్రభుత్వమిచ్చే భారతరత్న తరవాత గొప్పదైన 'పద్మ విభూషణ్'ను కూడా ఆయనకు ఇచ్చారు. 1985 లో ఈ బిరుదును అందుకున్న ముగ్గురు భారతీయుల్లో ఆమ్టే ఒకరు.

యాత్రామార్గంలో ఆయన ఉద్వేగంతో పలు ప్రసంగాలు చేశాడు. ప్రముఖుల సూక్తులను సందర్భోచితంగా ఉపయోగించటంలో ఆయన నేర్పరి. 'నిన్ను నీవు నడుపుకోదలిస్తే నీ మెదడును ఉపయోగించు.ఇతరులను నడుపవలసివస్తే నీ హృదయాన్ని ఉపయోగించు' అంటారు. కష్టమనుకున్న పనిని వెంటనే చేసేస్తే, అసాధ్యమనుకున్న దానిని కాస్త అలస్యంగా చేయగలం.

ఒకనాటి ఉదయమే ఒక కార్యకర్త ఆమ్టేజీని దర్శించి ఆయనను పొగుడుతూ ఒక అంగ్ల కవిత చదివాడు. మీరు చేసిన పనుల్ని సమీక్షించాలంటే నేను తత్వవేత్తను కాను. మీ విజయాల ఫలితాలను లెక్కగట్టాలంటే నాకు వచ్చిన లెక్కలు చాలవు...అంటూ బాబా ముఖంపై చిరునవ్వు మెరిసింది. ''ఉదయాన్నే కవిని చూశాను. ఈ రోజు మంచిరోజు'' అన్నాడు. ఆ కార్యకర్త ఆటోగ్రాపు అడగ్గా ఆమ్టే వదనం గంభీరంగా మారింది. పెదవి విరచి 'ఎందుకీ అశాశ్వతపు వస్తువు' నా సంతకాన్ని తీసుకోవడానికి బదులుగా నీవు చేస్తున్న కుష్ఠురోగుల సేవలను మరింత బాగాచేస్తానని హామీ ఇస్తూ నీవే నాకు సంతకం చేసి ఇవ్వగూడదూ? అన్నాడు.

సంఘటిత ఉద్యమం:

1988 నవంబరు ఒకటో తేదీ నుంచి 'సంఘటిత ఉద్యమం' రెండవ దశను ప్రారంభించారు. 15 రాష్ట్రాల గుండా తూర్పు, పశ్చిమయాత్ర అరుణాచలప్రదేశ్‌లోని ఇటానగర్ లో ప్రారంభమై గుజరాత్ లోని ఓఖాలో అంతము అయింది.

వీటితో ఆమ్టె కీర్తిప్రతిష్ఠలు నలుదిశలా తెలిశాయి. ఆ దీనజనబాంధవుడిపట్ల అభిమానం వెల్లువ కాసాగింది.

విశుద్ధ గాంధేయవాది,శాంతి ప్రియుడు, దరిద్రనారాయణ సేవాపరాయణుడు, నిరాడంబరజీవి,నవభారత ప్రవక్త. ఈ ఏడాది ఉత్తమమనిషి, సంఘపరివర్తకుడు, సాంఘిక వాస్తుశిల్పి వంటి పలువిశేషణాలతో పత్రికలు ప్రస్తుతించాయి. ప్రత్యేక వ్యాసాలు రాశాయి. ఆయన ఛాయాచిత్రాలను ముఖచిత్రాలుగా ముద్రించాయి.

సన్మానాల వెల్లువ:

1988వ సంవత్సరంలో విశ్వభారత విద్యాలయంవారు 'దేశికోత్తమ' బిరుదుతో సత్కరించారు ఆమ్టేజీని.

ప్రపంచంలో ఏ మూలన ఉన్నా సరే స్త్రీగాని, పురుషుడు గాని అందరూ సమానులేనని గుర్తిస్తూ మానవహక్కుల ప్రకటన 1948 లో చేశారు. దీని తర్వాత ప్రతి ఐదేళ్ళ కొకసారి మానవ హక్కుల పరిరక్షణకు విశిష్ఠ కృషి చేసిన వ్యక్తులకు గుర్తింపుగా ఈ అవార్డు ఇస్తున్నారు. ఈ తీర్మానము వచ్చి నలభై వసంతాలు నిండిన సందర్భంగా 1988లో ప్రపంచంలోని ఆరుగురు మహానీయులను ఐక్యరాజ్యసమితి సత్కరించింది. వీరిలో ఆమ్టే ఒకరు. కెనడా దేశపు జాన్ హంఫ్రీ, పోలాండ్ దేశపు ఆదమ్ లోపట్కా, ఈక్వెడార్ లోని బిషప్ (మరణానంతరము),నెల్సన్ మండేలా, వినీ మండేలాలు మిగతా ఐదుగురు.

ఇంగ్లాండులో స్థిరపడిన సర్ జాన్ టెంపుల్ టన్ అనే వ్యాపార వేత్త 1972 నుంచి ప్రారంభించిన అవార్డు ఇది. ఆధ్యాత్మికమైనది, భగవంతుని ఎడల ప్రేమను పెంపొందించేది అవగాహనను కల్గించే విశిష్ఠకృషికి గుర్తింపుగా ఇచ్చే ప్రపంచంలో ఎక్కువ విలువైన నగదు పురస్కారం ఇది. దీనికి నోబెలు బహుమతి కంటే కూడా ఎక్కువగా 5,80,000 అమెరికన్ డాలర్లు ఇస్తారు. 1973లో మదర్ థెరీస్సా, 1975 డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణన్ ఈ పురస్కారాన్ని అందుకున్న భారతీయులు.

1990 సంవత్సరపు టెంపుల్ టన్ అవార్డును బాబా ఆమ్టేకు,సిడ్నికి చెందినబిర్చ్ అనే 71 సం. రాల మెథోడిస్ట్ భోధకుడైన జీవశాస్త్రవేత్తకు

సంయుక్తంగా ఇచ్చారు. బాబా ఆమ్టే తరపున ఆయన పెద్ద కుమారుడు వికాస్ ఆమ్టే ఇంగ్లాండులోని బకింగ్ హాం ప్యాలెస్ లో ఈ పురస్కారాన్ని స్వీకరించి కృతజ్ఞతగా బాబా వ్రాసిన సందేశం చదివాడు.“నా దృష్టిలో మానవులలో హుందాతనం, ఆత్మాభిమానం కలిగించేదే గొప్ప మతం. నేను మతవాదిని కాను. కాని దృఢమైన,సరైన మానవుడిని తయారు చేయగల శక్తి మతం అనుకుంటాను” అన్నారు.

దలైలామా సందర్శన

ఒకసారి దలైలామా ఆమ్టేను చూడడానికి వచ్చాడు. ఆ నోబెల్ శాంతి బహుమతి గ్రహీత ఆనందవన్ అంతా తిరిగి చూశాడు. పాఠశాలకు ఒక నూతన భవనాన్ని ప్రారంభించాడు. ఐదు వేల మంది దాకా హాజరైన సభనుద్దేశించి ప్రసంగిస్తూ ప్రేమ, అనురాగం, దూరపు చూపు వంటి మాటలను కేవలం వల్లించడంవల్ల ప్రయోజనం లేదు. మీరు ఆ పదాలను క్రియాత్మకరూపాలుగా అనువదిస్తున్నారు. మీ కోసం నన్ను కొంచెమైనా సహాయం చేసే అవకాశం ఇవ్వండి. మీ పథకాలకు తొలివిడతగా 20 వేల అమెరికన్ డాలర్ల విరాళం ఇస్తున్నాను‘ అన్నారు.

ఆమ్టేతో ఏకాంతంగా మాట్లాడుతుండగా దలైలామాకు కళ్ళు చెమర్చాయి. అద్దాలుతీసి కళ్ళు తుడుచుకోవడం ఆమ్టే చూసి ‘ మీ అశ్రు బిందువు హృదయాన్నిఛేదించాలి’ అన్నారు.

పర్యటన తరువాత ఆమ్టేకు రాసిన లేఖలో ‘ నా ఆనందవన్ యాత్ర చిరకాలం మరపురాని వాటిలో ఒకటి. భారతదేశపు అత్యధిక జనాభా గ్రామీణులే. కనుక ఈ దేశనేతలు, రాజకీయవేత్తలు మీ కృషి వైపు దృష్టిసారిస్తే బాగుంటుందనుకుంటాను’ అన్నారు.

పర్యావరణ పరిరక్షణకు

భారతదేశం మధ్యలో పుట్టి పడమటి దిశగా పయనించి అరేబియా సముద్రంలో కలిసే నదులలో 600 కి.మీ. పైగాపొడవుగల పెద్దనది నర్మద. దీని

మీద 30 దాకా పెద్ద ఆనకట్టలు, 150 దాకా చిన్న చిన్న ఆనకట్టలు రెండు దశలుగా కట్టాలని ప్రభుత్వ అలోచన. వీటిలో 'సర్దార్ సరోవర్', 'ఇందిరా సాగర్' లు రెండు పెద్ద ప్రాజెక్టులు. ఈ ఆనకట్టల సముదాయం వల్ల సంభవించనున్న ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, పర్యావరణ పరిణామాలను పరిగణించకుండానే కేంద్రప్రభుత్వం ఇందుకు ఆమోదం తెలిపింది. 11 వేల కోట్ల రూపాయలు ఖర్చు అంచనాలో 700 కోట్లు అప్పు ఇవ్వడానికి ప్రపంచ బ్యాంకు కూడా అంగీకరించింది.

ఈ అనకట్టల వల్ల మూడులక్షల మంది ప్రజలు, ముఖ్యంగా పేద రైతులు, ఆదిమవాసులు, గిరిజనులు తాము పుట్టి పెరిగిన ప్రాంతాలను, పరిసరాలను వదలి కొత్త ప్రాంతాలకు వెళ్లాలి. వందల గూడేలు మునిగిపోతాయి. 40 వేల కోట్ల విలువైన అటవీ సంపద నాశనం అవుతుంది. అరుదైన జంతుజాలం, వన్యమృగాలు అంతరించిపోతాయి. వీరందరికి పునరావాసం కల్పించడం సాధ్యమయే పనికాదు. ఈ నష్టాలు పూడ్చడానికి వీలులేనివి.

ఇది భూకంపాలకు లోనుకాగల ప్రాంతము అని నిపుణులు సాక్ష్యాధారాలతో హెచ్చరిస్తున్నారు. భూకంపాలను తట్టుకోగలస్థాయిలో నిర్మాణం జరగాలంటే ఖర్చు ఎక్కువవుతుంది.

1988 జూలై లో భావసారూప్యము గల దేశంలో ప్రముఖులు, పర్యావరణ నిపుణులు, ఇంజనీర్లు, భూగర్భ, ఆర్థిక శాస్త్ర నిపుణులు, 130 మంది ఆనందవన్ లో సమావేశమయ్యారు. జ్ఞానపీఠ పురస్కార గ్రహీత శివరామకరంత్, సుందరలాల్ బహుగుణ, షబ్నాఅజ్మి, మేనకాగాంధి ప్రభృతులు పాల్గొన్నారు.

ప్రకృతిమానవుల అవసరాలను తీర్చగలుగుతుంది. గాని మన దురాశలను తీర్చలేదు. ప్రకృతిలో ప్రతిప్రాణీ విలువైనదే. ఒకదాని మీద మరొకటి ఆధారపడి పర్యావరణ సమతుల్యాన్ని పరిరక్షిస్తుంటాయి. ఆఖరుకు వానపాము కూడా మనకు సాయపడుతుంది. సహజఎరువును అందిస్తుంది. నేలను దున్ని, గుల్లబారే లాగా చేసి పైరు పంటల పెరుగుదలకు తోడ్పడుతుంది. మనం

ప్రకృతిలోని సహజ వనరులను ఎక్కువగా వినియోగించుకుంటున్నాం. అంటే రాబోయే తరాలవాళ్ళ సంపదను మనం దొంగిలిస్తున్నాం. వారి మనుగడకు ముప్పు తెస్తున్నాం. అని చర్చించి 'నర్మదను రక్షించండి' అనే ఉద్యమాన్ని ప్రజాఉద్యమంగా ప్రారంభించారు. టాటా ఇనిస్టిట్యూట్, బొంబాయి నుంచి పట్టభద్రురాలైన 35 సంవత్సరాల మేధాపట్కర్ ఆమ్టేకు కుడిభుజంగా నిలిచింది. 1965 లో తన క్షేత్రఅధ్యయనంలో భాగంగా నర్మద పరివాహక ప్రాంతాన్ని తిరిగి చూసిన అనుభవం ఆమెకు వున్నది.

నర్మద ప్రాంతానికివెళ్ళి ఉద్యమం కొనసాగించదలచిన ఆమ్టే ఆనందవన్ ను విడిచి వెళ్తూ ఇలా అన్నాడు. '' ఈ చోటు నా మనుగడకే అర్థం ఇచ్చిన చోటు. ఇక్కడి నుంచి నర్మదా తీరానికి వెళ్తున్నాను. సామాజిక అన్యాయాలను ప్రతిఘటిస్తూ జరిగే పోరాటాలకు ప్రతీకగా 'నర్మద' ప్రజల నాలుకల మీద నాట్యం చేస్తుంది. నా జీవన సాయంసంధ్యా సమయాన పర్యావరణ అనే సూర్యోదయ సంధ్యను పట్టుకుంటున్నాను.

నేను శారీరకంగా అవిటివాడినే కావచ్చు. కాని ఉత్సాహంలో, ఉద్దేశంలో కాదు. నాది సరళమైన మార్గం. ఈ పోరాటం చివరి వరకూ కొనసాగుతుంది.

ఈ పెద్ద ఆనకట్టలను కడితే ముందుగా మునిగిపోయేది మధ్యప్రదేశ్‌లోని హర్సుద్ అనే గ్రామం. ఆ ఊరి పొలిమేరలలో నా కుటీరం నిర్మించుకొని ఉంటాను. అక్కడ జలసమాధి కావడానికైనా సన్నద్ధమై వెళ్తున్నాను.

ప్రభుత్వాలు ఇలా పట్టీపట్టనట్లు వ్యవహరించే ధోరణి కొనసాగిస్తే నర్మదానది నీళ్ళతో కాక లక్షలమంది ప్రజలకన్నీళ్ళతో కడలిలా పారుతుంది.

భారతదేశం మరణిస్తే జీవించే వారుండరు. భారతదేశం జీవిస్తే మరణించే వారుండరు.

నా మాతృమూర్తికి నేను కంకణాలిస్తాను.

కాని

పెద్ద అనకట్టలతో

ఆమె కాళ్ళను కట్టివేయను,
విస్తారమైన ఆమె కురులను
నీటిలో మునిగి పోనీయను
నన్ను ఆమె లాలించి పెంచినట్లుగా
నేను ఆమెను అలరించడానికి
మా అమ్మకు
చిన్న చిన్న ఆనకట్టలతో ఆభరణాలు చేయిస్తాను.

మనం 21వ శతాబ్దంలోకి దూసుకుపోతున్నాం. మనమంతా పురోగమనం చెందడానికి ఆటంకంగా స్వార్థపరులు విజృంభించి వీరవిహారం చేస్తున్నారు. అయితే వారి సంఖ్య చాలా స్వల్పం, వారితో మాట్లాడటం వృధా, బాబ్రీ మసీదులు, రామజన్మభూములు, నర్మద ప్రాజెక్టులు వంటివి వాళ్ళకు కావాలి'' అన్నాడు.

ఉధృతమైన ఉద్యమం

ఆమ్టే, మేధాపట్కర్ మున్నగువారు ముందుకు సాగుతుండగా పదివేల మంది గిరిజన యువతీ యువకులు ఒకరిచేయి మరొకరు పట్టుకొని మానవవలయంగా ఏర్పడి ప్రభుత్వ ప్రయత్నాన్ని ప్రతిఘటించారు. వీరు శాంతియుతంగా గుజరాత్ రాష్ట్రంలోకి ప్రవేశించాలని ప్రయత్నించారు. శాంతి భద్రతలు కాపాడవలసిన రక్షకభటులే లాఠీలు ఝుళిపించారు. స్వాతంత్ర్యపోరాట సమయంలోని విదేశీ పాలకుల దమనకాండను గుర్తుకు తెచ్చే విధంగా ఉన్నదా చర్య.

ఆమ్టే కుటీరం ఎదురుగా మైకులు పెట్టి చెవులు హోరెత్తే శబ్దాలతో ఆమ్టేకు వ్యతిరేకంగా పాటలు, నినాదాలు వినిపించరు. కాంతివంతమైన దీపాలను ఆ కుటీరం వైపు కేంద్రీకరించారు. ఆమ్టేకు నిద్ర పట్టకుండా చేశారు. ఉద్యమకారులను దేశద్రోహులుగా, విదేశీఏజెంట్లుగా విమర్శించారు.

మేధాపట్కర్ జనవరి 91 లో 21 రోజులు నిరాహారదీక్ష జరిపి ప్రాణాపాయం నుంచి గట్టెక్కింది.

బిరుదుల తిరస్కారం

''నర్మదను రక్షించండి'' ఉద్యమకారుల శాంతియుత యాత్రపై జరిగిన హింసకు ఆమ్టే చలించాడు. గతంలో తనకు ప్రభుత్వం ఇచ్చిన గౌరవపురస్కారాలైన పద్మశ్రీ, పద్మవిభూషణ్‌లను, 1991 మార్చిలో రిజిష్టర్డ పార్శిలు ద్వారా భారత రాష్ట్రపతికి తిప్పి పంపివేశాడు.''వీటిని నా వద్ద ఉంచుకోవడం ఇంకెంత మాత్రమూ సముచితం కాదనుకుంటున్నాను'' అని నిరసన రాశాడు. అనేక మంది అభిమానులు, కార్యకర్తలు దూర దూర ప్రాంతాల నుంచి వచ్చి ఆమ్టేకు మద్దతు తెలియజేశారు.

పసలేని ప్రభుత్వ వాదనలు:

ఈ ప్రాజెక్టులు గుజరాత్ రాష్ట్రంలో మంచినీటి కొరత తీరుస్తాయి అంటుంది ప్రభుత్వం. కానీ సౌరాష్ట్ర ప్రాంతంలోని 69 తాలూకాలలో 58 కి,47 గిరిజన తాలూకాలలో 42 కు వీటివల్ల చుక్కనీరు కూడా రాదు. ఈ ప్రాజెక్టువల్ల మధ్యప్రదేశ్‌లో మునిగిపోయే భూమి ఎక్కువ. సాగు అయే భూమి తక్కువ.

1987-88 సం..ములో అంచనా ప్రకారం వీటికి ఖర్చు 11,154 కోట్లు. 7వ ప్రణాళిక మొత్తం కాలంలో కేంద్ర ప్రభుత్వమూ అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు కలసి భారీ, మధ్య తరహా ప్రాజెక్టు లన్నింటికీ చేసిన ఖర్చుకు ఇది సమానం. గుజరాత్ రాష్ట్రం 7వ ప్రణాళికలో అన్ని పద్దుల కింద చేసిన ఖర్చుకు ఇది రెట్టింపు. ఇందులో అప్పుగా వివిధ మార్గాల ద్వారా1000 కోట్లు వస్తుంది. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్తాన్ లు తమ వాటాగా 2000 కోట్లు ఇస్తాయనుకుందాం. మరి మిగిలిన 8154 కోట్లను 8 సం.. రాలలో గుజరాత్ ఎక్కడ నుండి తెస్తుంది. గుజరాత్ లో బడ్జెట్ లోటు ఏటేటా పెరుగుతుంది. అది ఈ ఏడు 600 కోట్లు ఉండవచ్చు. ఒక వేళ తీరికగా పూర్తిచేసుకుందామంటే అసలే లాభం లేదు 17

నుంచి 22 సం..రాలలో ప్రాజెక్టు పూర్తి చేయాలని మొదట అంచనా వేసి, అది గిట్టుబాటు కాదని, అలా ఐతే ఖర్చుచేసిన రూపాయికి రూపాయి గూడా తిరిగిరాదని ప్రభుత్వమే తేల్చి ప్రాజెక్టును 10 ఏళ్ళలో ముగించాలని మొదలుపెట్టారు. ఇదెలా సాధ్యం? ఈ కొత్త అంచనాలు అన్నీ సరిగ్గా జరిగినా పెట్టిన రూపాయి పెట్టుబడికిరు.1-12 పైసలు మాత్రమే ఆదాయం వస్తుంది. ఒక రూపాయి ఖర్చుకు కనీసం రూపాయిన్నర ఆదాయం వచ్చే హామీఉంటేనే ఏ ప్రాజెక్టునైనా చేపట్టాలంటారు ఆర్థిక శాస్త్రజ్ఞులు. అన్నీ తెలిసి, ఇంత మొండిగా అరుదైన వనరులన్నిటినీ ఒక్క పెద్ద ప్రాజెక్టులో కుమ్మరించడం వల్ల లాభం రాజకీయ నాయకులకు, కాంట్రాక్టర్లకే గాని సామాన్య రైతులకు గాదు. దేశ ఆర్థికవ్యవస్థకు కాపలా కాయవలసిన ప్రణాళికాసంఘం ఎలా ఆమోదం తెలిపిందో అర్థం కాదు.

ప్రజాప్రభుత్వలే వివరాలను ప్రజలకు తెలియకుండా దాస్తున్నారు. నేలకోతపడి జలాశయం పూడికోకుండా ప్రత్యామ్నాయ అడవుల పెంపకానికి, పల్లపునేలలు చవుడు బారకుండా చేయడానికి, 3 లక్షల మందికి పునరావాసం కల్పించడానికి ఎంత డబ్బుకావాలి? అసలివన్నీ డబ్బు ఉన్నాచేయగల పనులేనా?

దేశంలో 181 పెద్ద ప్రాజెక్టుల నిర్మాణం ఇంకా పూర్తి కావలసివుంది. వీటికి 26 వేల కోట్లు కావాలి. డబ్బు లేక పనులు వాయిదా వేసుకుంటున్నాం. వాయిదావల్ల ఖర్చు పెరుగుతుంది, వడ్డీ పెరుగుతుంది, అప్పు అధికమవుతుంది. ఏటా నీటిపారుదలశాఖ వల్ల ప్రభుత్వానికి 800 కోట్ల నష్టం వస్తుంది. ఈ స్థితిలో మరికొన్ని బృహత్ వారధులను కట్టటం సమంజసమా? హేతుబద్ధమా? ప్రభుత్వ అంచనాల ప్రకారమే ఒక హెక్టారుభూమిని సాగుచేయడానికి ఈ పెద్ద ప్రాజెక్టుల ద్వారా 60 వేల రూపాయలు ఖర్చు అవుతుంది. అదే హెక్టారును చిన్న ప్రాజెక్టుల ద్వారా ఐతే ఇందులో నాలుగోవంతు ఖర్చుతోనే సాగు చేయవచ్చు. చిన్న ప్రాజెక్టులు మార్పులు చేసుకోవడానికి వీలుగా వుంటాయి, త్వరగా పూర్తి అవుతాయి. స్థానికులు సహాయం పొందవచ్చు.

మెరక ప్రాంతాలకు మంచి నీటిని లిఫ్టు ఇరిగేషన్ ద్వారా సమకూర్చవచ్చు. మెట్టసాగుకు, వర్షపు నీటి సద్వినియోగానికి ప్రాధాన్యత ఇవ్వాలి. కట్టెలు, గోబర్ గ్యాస్ వంటి వాటిని సక్రమంగా వాడుకొని, విద్యుత్తు పొదుపు చేయడం వంటివి ప్రచారం చేయాలి. ఏడో పంచవర్ష ప్రణాళికలో 19 శాతం విద్యుత్ ఉత్పత్తికి కేటాయించి 1 శాతం బయోమాస్ వంటి వాటికి కేటాయించారు.

ప్రధానికి లేఖ:

ప్రభుత్వ మొండి వైఖరికి విసిగిపోయి 89 సెప్టెంబరులో ఆమ్టే నాటి ప్రధాని రాజీవ్ గాంధీకి ఒక లేఖ వ్రాశారు. ''......... ఈ ఉద్యమాన్ని ఎవరూ ఆపలేరు. నా గళాన్ని ఈ విధంగా గాని మరో విధంగా గాని మూగపోనీయలేరు.

సాంకేతికంగా సరిపోనిది, విధానపరంగా విరుద్ధమైనది, ఆర్థికంగా అసాధ్యమైనది, ఆదాయరీత్యా నిరర్థకమైనది, పర్యావరణ దృష్ట్యా వినాశకరమైనది – అన్నిటికీ మించి లక్షలాది ప్రజలను నిర్వాసితులను చేసేదైన ఈ ప్రాజెక్టుల అనర్థాల గురించి పదే పదే వివరిస్తున్నా పట్టించుకోకుండా ఎందుకు ముందుకు వెళ్తున్నారో అర్థం కాదు. ఒకటి, రెండు సార్లు కాదు, వందలసార్లు మా వాదన మీకు వినిపించాము. మీ దగ్గర నుంచి ఏమీ ప్రతిస్పందన లేదు.

ప్రియ రాజీవ్,

నీ నిశ్శబ్దం నన్ను చకితుణ్ణి చేస్తుంది. గిరిజనుల భరింపరాని వేదనలు, బాధలు, కన్నీళ్ళు నా కళ్ళముందు కదిలాడుతున్నాయి. నా ఆత్మమీద ప్రగాఢమైన ముద్రవేశాయి.''

ఆమ్టే నిస్వార్థ సేవలు మరోమారు అంతర్జాతీయ గుర్తింపు పొందాయి. ఆయన కీర్తి కిరణాలు మాతృభూమి పొలిమేరలను కూడా దాటి ప్రసరించటం కొనసాగింది.

సముచిత జీవనమార్గ అవార్డు:

జీవితాన్ని సమగ్రవంతంగా తీర్చిదిద్దటానికి, భూగోళానికి జరిగే హానిని మాన్పడానికి, మానవాళిని ఉద్ధరించడానికి దూరదృష్టితో చేసిన కృషికి గుర్తింపుగా ప్రతి ఏటా స్వీడిష్ పార్లమెంటు స్టాక్ హోమ్ లో దీనిని ఇస్తారు. నోబెల్ బహుమతుల ప్రధానోత్సవానికి ముందు రోజున ఈ పురస్కార ప్రదానసభ జరుగుతుంది. 1,65,000 డాలర్ల మొత్తాన్ని వ్యక్తుల పేరుతో కాక ఒక నిర్దేశిత ప్రాజెక్టుకు ఇస్తారు.

1991 లో ఈ అవార్డును రెండు సంస్థలకు కలిపి ఇచ్చారు. బ్రెజిల్ దేశంలో భూసంస్కరణల కోసం దీర్ఘకాలం విజయవంతంగా అంకిత భావంతో పోరాడి భూమిలేని నిరుపేదలకు భూమిని పంచి తద్వారా వ్యవసాయ ఉత్పత్తులను పెంచడానికి దోహదపడిన సంస్థ ఒకటి.

‘‘తమ నేతృత్వ ప్రేరణ ద్వారా ప్రపంచ ప్రాధాన్యత గల ఒక అంశంపై చర్యను లేవనెత్తినందుకు, మొక్కవోని సంకల్పంతో పర్యావరణదృష్ట్యా ప్రళయసమానమైన ప్రపంచంలోనే పెద్ద ప్రాజెక్టు నిర్మాణానికి వ్యతిరేకంగా పోరాడుతూ, ప్రత్యామ్నాయ పథకాల ద్వారా పేదలకు ప్రయోజనం కలిగిస్తూనే పర్యావరణ సమతుల్యం దెబ్బతినని సూచనలు చేస్తున్నందుకు ‘నర్మదను కాపాడండి’ ఉద్యమ నేతలు, బాబా ఆమ్టే మరియు కుమారి మేదాపట్కర్లు రెండవవారు.

ఉద్యమకారులు తెలిపిన అభ్యంతరాలను దృష్టిలో వుంచుకొని ప్రపంచబ్యాంకు వారు ఈ ప్రాజెక్టుల పునఃపరిశీలనకు ఒక కమిటీని వేశారు. తాను అప్పు ఇస్తున్న పథకాన్ని గురించి పునః పరిశీలనకు కమిటీని నియమించడం ప్రపంచబ్యాంకు చరిత్రలో ఇదే మొదటిసారి. ఐక్యరాజ్య అభివృద్ధి కార్యక్రమ అధినేతగా పనిచేసిన అమెరికన్ పార్లమెంటేరియన్ బ్రాడ్ ఫర్డ్ మోర్చ్, కెనడాకు చెందిన మాజీ జడ్జి నేతృత్వంలో ఈ కమిటీ పునరావాసం, పర్యావరణ అంశాలపై విచారణ జరిపి 360 పేజీల రిపోర్టు ఇచ్చింది.

''1985 లో అప్పు అడిగేటపుడు చేసుకున్న ఒప్పందాలను ఈ రెండు రంగాలలోపై ఉల్లంఘించినట్లు తేలింది. మహారాష్ట్ర మధ్యప్రదేశ్ ప్రభుత్వాలు గిరిజనుల పునరావాసాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశాయి. ఒక లక్షా నలభై వేల మంది రైతులు తమ భూములను కాలువల కింద పోగొట్టుకుంటారు. వీరికి పరిహారం సంగతే పట్టించుకోని గుజరాత్ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించాలి. ఏమైనా ప్రభుత్వాలు ఒక అడుగు వెనక్కు వేసి మొత్తం పరిస్థితిని పునఃసమీక్ష చేయాలి'' అన్నారు ఈ నివేదికలో.

అయినా ప్రభుత్వ ప్రయత్నాలు ఆగలేదు. ఆమ్టే పోరాటమూ ఆగలేదు. ఆమ్టే జీవిత చరిత్ర చివరి అధ్యాయం లేని మహాకావ్యం.

\- పి.సాంబశివరావు

* * *